నవ్వడం మన లక్షణంగా మారాలంటే...

# హాస్యానందం


సంపూర్ణ హాస్య మాస పత్రిక


చదవండి!

ఫిబ్రవరి-2023

వెల: ₹20

తెలుగులో వెలువడుతున్న
ఏకైక హాస్య మాస పత్రిక






# KNR PROPERTIES

Buy / Sell / Lease
Commercial Buildings, Office Space,
Independent Houses, Villas,
Apartment Flats, Plots & Lands



Ramakrishna Reddy





హైదరాబాద్ హైటెక్ సిటీ, మాదాపూర్,
గచ్చిబౌలి, కోకపేట, జూబ్లి హిల్స్,
బంజారా హిల్స్, సోమాజిగూడ ప్రాంతంలో,
అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్, కమర్షియల్ బిల్డింగ్స్,
ఆఫీసు స్పేస్‌లు, స్థలాలు, ఇండ్లు, విల్లాస్‌లు
మరియు

**HMDA & DTCP OPEN PLOTS**

(200, 300, 500, 1000 గజాలు) &
ల్యాండ్స్ అమ్మబడును
మరియు కొనబడును.

**BANK LOAN AVAILABLE**

**Contact No :**

# 80000 45500

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం

ఫిబ్రవరి-2023

20వ సంవత్సరం

224 వ సంచిక

జీ'వనం'లో నవ్వు
నవ వసంతం

*Publisher& Editor-*
*Ramu.P*

*Full Pillar* :
Bnim

*Cartoon Feature Editor*:
Bachi

*D.T.P*:
P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

సంవత్సర చందా-రూ.300/-
(పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

జీవిత చందా- రూ.5000/-లు

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.



ముఖచిత్రం:
అనుపమ పరమేశ్వరన్
కార్టూన్:గోపాలకృష్ణ

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
*Cartonist* Ramprasad
North Coastal Andhra
Cartoonists Forum

*Creative Team*
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Dayakar
Sangram
Krishna
Bomman
GopalKrishna
Venkat
Muralidhar

గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...


## కథలు...

| | | |
|---|---|---|
| ఫర్ సేల్ | -మల్లాది వెంకట కృష్ణమూర్తి | -9 |
| భార్య భర్తల మధ్య కండిషన్ లవ్ | -నల్లపాటి సురేంద్ర | -12 |
| మా అన్నయ్య వచ్చాడు | -బొందలనాగేశ్వరరావు | -16 |
| త్రిసహస్ర కవితా సమ్మేళనం | -పి.ఎన్.బి.యస్.శ్రీనివాస్ | -19 |
| మర్చిపోలేని బహుమతి | -మాధవి బైటారు | -23 |
| తూనీగా... తూనీగా... | -జి.ఎస్.ఎన్. శర్మ | -30 |
| కగాకో.... ముగాభా... | -బుద్ధవరపు కామేశ్వరరావు | -34 |
| మౌన వ్రతం | -ఆర్.సి.కృష్ణస్వామి రాజు | -40 |
| మనసులో మాట | -కంచనపల్లి ద్వారకనాథ్ | -42 |

## శీర్షికలు

| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -7 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -10 |
| ఫన్‌పంచ్ | -గుండు సుదర్శన్ | -26 |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -45 |

## స్పెషల్స్

| | | |
|---|---|---|
| వేలెంటె(వైలె)న్సడే... | -శేఖర్,నాగిశెట్టి,ధీరజ | -15 |
| కొత్త పుస్తకాలు | -డా॥ రావెళ్ళ | -18 |
| 'బహుమతుల' ప్రదాన మహోత్సవం | | -28 |
| నేటి ప్రేమికులు | -గోపాలకృష్ణ,చక్రవర్తి,పద్మ | -44 |
| ప్రమాదం | -దయకర్ | -50 |

## సీరియల్

| | | |
|---|---|---|
| ఇందు చందు-నవ్వులవిందు | -కంద్లకుంట శరత్‌చంద్ర | -46 |

## కార్టూన్ శీర్షికలు

| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -14 |
| నవ్వే ఆనందం | -గోపాలకృష్ణ | -20 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -21 |
| కోర్టూన్లు | -బాచి | -21 |
| హాస్యబ్రహ్మలు | -అంతోటి ప్రభాకర్ | -25 |
| కార్టూన్ బరస్ట్ | -వడ్డేపల్లి వెంకటేష్ | -33 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -37 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -39 |
| లోకంతీరు | -కృష్ణ | -41 |
| బాలి కార్టూన్‌కి క్యాప్షన్ | | -41 |
| దెయ్యాల గోల | -ఎన్.పి.ఎస్.రావు | -48 |
| భలే బాస్ | -బొమ్మన్ | -49 |
















## ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- బాచి
- గాంధీ
- గోపాలకృష్ణ
- నాగిశెట్టి
- దయాకర్
- రామ్‌శేషు
- ప్రసాద్ కాజ
- డి.శంకర్
- శ్రీ
- శర్మ
- టి.ఆర్.బాబు
- చక్రవర్తి
- సునీల్
- బొమ్మన్
- ఎన్.పి.ఎస్.రావు
- భాను
- పద్మ
- ఎమ్.ఎ.రవూఫ్
- శేఖర్
- ధీరజ
- సునీల్
- టి.ఆర్.బాబు
- హేమంత్
- శ్రావణి
- పి.పి.నాయుడు
- దొరశ్రీ
- శేషయ్య
- శేఖర్‌బాబు
- వడ్డేపల్లి వెంకటేష్
- డేవిడ్
- సురేంద్ర
- ప్రసిద్ధ
- సుధాకర్
- మణి
- రంగాచారి
- సుందరం
- సీతారామ్
- పెండేల
- కన్నాజీరావు
- క్రిప్
- శివప్రసాద్
- రవిశర్మ
- నవ్య

## హాయ్...సానందంగా...




**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... హాస్యప్రియులకు సన్నిహితులకు**
**హాస్యాభివందనాలు!**

ఎప్పుడో నేను చదివిన ఒక కొటేషన్– 'స్నేహం కోసం ప్రాణాలివ్వడం ఏ మాత్రం కష్టం కాదు...కానీ దానికి అర్హత ఉన్న స్నేహితులు దొరకడమే కష్టం!' అని... ఈ వాక్యాం అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ వాస్తవాన్ని చాటే నిత్య సత్యం! మనం మన జీవితంలో చాలా మందిని కలుస్తాం... కొంతమందితో కొన్నాళ్ళు స్నేహం కొనసాగుతుంది...మరికొంత కాలం తరువాత వాళ్ళలో కొందరు మాత్రమే మిగులుతారు. ఈ దూరమయినవాళ్ళు 'ఎందుకు దూరమయ్యారు?' అనే ప్రశ్న వేసుకుంటే 'అవసరం' అనే 'వాస్తవం' బయటపడుతుంది. స్నేహాల్లో కూడా లెక్కలు వేసుకుని, అవసరాలని బేరీజు చేసుకుని కాలం గడిపే మనం... 'ఇది ఎంత వరకు సమంజసం?' అని ఒక్కసారి ఆలోచిద్దాం! చాలా రోజుల తరువాత కలిసిన మిత్రునితో 'ఏమిటీమధ్య పలకరించటం లేదు?' అని పలకరిస్తాం... అదే ప్రశ్న మనకు మనం వేసుకోం! సరే అతను 'నేను చాలా బిజీ' అంటాడు... మనం కూడా అదే సమాధానం ఇస్తాం! రెండూ అబద్ధాలే!... నిజంగా ఒక వ్యక్తిని పలకరించడానికి(ఫోన్‌లో) కూడా 'టైం' ఉండనంత బిజీగా ఉన్నామా? ఫోన్‌లు పట్టుకుని ఇటు అటూ తిప్పుకుంటూ గంటల తరబడి వీడియోలు, వాట్సాప్‌లు చూసుకునే మనకి ఒక పలకరింపుకి టైం ఉండదా?... రోజూ పలకరించాలన్నది నా ఉద్దేశం కాదు గానీ... కనీసం వారానికి ఒక్కసారైనా పలకరించి... యోగక్షేమాలు తెలుసుకుంటే ఎంత బాగుంటుంది? ఒకప్పుడు ఈ యోగక్షేమాల కోసమే 'ఉత్తరాలు' రాసుకునే వాళ్ళం. పది రోజుల తరువాత మనకి 'జవాబు' జాబు వచ్చేది. ఎంత బాగుండేది? మరి ఇప్పుడు ఒక్క నిముషంలో జరిగిపోయేదాన్ని ఎందుకు విస్మరిస్తున్నాం!... అందర్నీ పలకరిద్దాం!... స్నేహాల్ని కాపాడుకుందాం... మనకు 'ఇంత'మంది ఆప్తులున్నారని గర్వ పడదాం! స్నేహితుల కోసం ప్రాణాలు ఇవ్వక పోయినా...ప్రాణ స్నేహితులు అనుకునే నలుగురితో స్నేహం కొనసాగిద్దాం!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా
ఉండాలని కోరుకుంటూ.....

Ramu.P












✦ **ఆర్.శ్రీరామకృష్ణ,రాజమండ్రి**

**జ**నవరి హాస్యానందం ఫలితాల ప్రత్యేక సంచిక సూపర్! పోటీల్లో గెలుపొందిన కార్టూన్లు, ఉత్తరాలు, చక్కెరకేళి ఎస్.ఎమ్.ఎస్‌లు అన్నీ బావున్నాయి. బాపురమణ అవార్డు ప్రదానోత్సవ వివరాలు కూడా ఈ సంచికలోనే రావటం పత్రిక్కి నిండు తనం వచ్చింది. అలాగే ఇందులో కథలు, కార్టూన్లు నవ్వించటంలో సఫలీకృతమయ్యాయనే చెప్పాలి. మీ కృషికి అభినందనలు.

✦ **జి.వి.రాజశేఖర్, హైదరాబాద్**

**హా**స్యానందం నవ్వించటంలో నూటికి నూరు శాతం విజయం సాధించింది అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. హాస్యానందం పత్రికకి అనుగుణంగా ఏమాత్రం అశ్లీలం లేకుండా కార్టూన్లు, కథలు పంపిస్తున్న రచయిత(త్రు)లకు, కార్టూనిస్టులకు అభినందనలు. ఆల్ ది బెస్ట్ టు ఎంటైర్ టీం!

✦ **కె.పల్లవి, బెంగళూరు,**

**ఈ** మధ్య నేను హైదరాబాద్ వెళ్ళినప్పుడు హాస్యానందం చూశాను. సింప్లీ సూపర్! ముఖ్యంగా హాయ్ సానందంగాలో చెప్పినట్లు 'నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది. అన్న ఎడిటోరియల్ విషయం చాలా సింపుల్‌గా చాలా చక్కగా వివరించారు. ఇక కథలు, కార్టూన్లు, బహు మతి పొందినవన్నీ బావున్నాయి. ముఖ్యంగా బర్త్‌డే బాయ్ సుదర్శన్ గారితో ఎడిటర్‌గారి ఫన్ పంచ్ చాలా బాగుంది. మొదటి పేజీలో చెప్పినట్లు 'ఆనందానికి ఆధారం నవ్వు' అన్న మాట నేను నమ్ముతాను.

✦ **బి.రాధాకృష్ణ, విశాఖపట్టణం**

**జ**నవరి హాస్యానందం ముఖచిత్రం కార్టూన్ నేటి సమాజంలో టెక్నిక్‌ని ఎలా వాడుతున్నారో... కళ్ళకు కట్టినట్లు చూపించారు. కృష్ణగారికి అభినందనలు. ఈ సంచికలో 'చక్కెరకేళి' ఎస్.ఎమ్.ఎస్‌లు షుగర్ వ్యాధిపట్ల అవగాహన పెంచాయి. ఇది గొప్ప ప్రయోగం! బేతాళకథలును మరిపిస్తున్న 'తర్కారావు కథలు' చాలా బావుంటు న్నాయి. ప్రతినెలా ఆరోగ్యకరమైన హాస్యంతో వెలువడుతున్న హాస్యా నందం మాకు ఆరోగ్యటానిక్ అని చెప్పటంలో ఏమాత్రం సందేహం లేదు.

✦ **కె.ప్రమీలారాణి,చెన్నై**


**హా**స్యానందం జనవరి సంచికలోని అన్ని కథలు, కార్టూన్లు, ముఖ్యంగా ఫన్‌పంచ్ చాలా బావున్నాయి. ఎడిటోరియల్‌లో చెప్పినట్లు– 'ఎవరూ ఎవరినీ పోషించరు. జస్ట్ మనకంటూ ఆప్తులు, సన్నిహితులు న్నారనే ధైర్యం... అంతే! ఈ రోజు మనదే!... మరి రేపటి పరిస్థితి?... కాస్త ఆలోచిద్దాం!...' అన్న మాటలు బంధాలు ఎందుకు ఎలా కాపాడుకోవాలో చాలా చక్కగా చెప్పారు. థ్యాంక్స్!

# ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు
**ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**




కార్టూన్ ఇష్టులు
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి**
**రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి**
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






కార్టూనిస్టులపై
ప్రేమతో, వాత్సల్యంతో
**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.



**31,392 నగదు బహుమతులతో...**

# కార్టూన్ పోటీలు

**హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్టూన్ పోటీలను విజయవంతం చేయాలని మనవి!**

## కీ.శే.తోరహతుల వెంకటరత్నం శ్రీమతి వనజాక్షమ్మ దంపతుల పురస్కారం-2023

(వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు,కోడలు అందిస్తున్నారు)

**నగదు బహుమతి-10,116/-**
**జ్ఞాపిక+ ప్రశంసాపత్రం**




**5 ప్రత్యేక బహుమతులు**

**నగదు బహుమతి-1,116/-**
**+**
**ప్రశంసాపత్రం**




## కీ.శే.తోరహతుల నాగేశ్వరరావు పురస్కారం-2023

(వారి జ్ఞాపకార్థం వారి తమ్ముడు,మరదలు అందిస్తున్నారు)

**నగదు బహుమతి-10,116/-**
**జ్ఞాపిక+ ప్రశంసాపత్రం**

**5 ప్రత్యేక బహుమతులు**

**నగదు బహుమతి-1,116/-**
**+**
**ప్రశంసాపత్రం**

**2 పురస్కారాలు 10 ప్రత్యేక బహుమతులు**

గమనిక:

- ఒకో కార్టూనిస్టు 3 కార్టూన్లు పంపవచ్చును.
- అసభ్యకరమైన కార్టూన్లు నిషేధం!
- క్యాప్షన్‌లెస్ కార్టూన్‌లకు ప్రాధాన్యత.
- క్యాప్షన్ ఉన్నా క్లుప్తంగా, ఏకవాక్యంలో ఉండాలి.
- 300 లో స్కాన్ చేసి మెయిల్ చేయాలి!
- విడివిడిగా ఎంట్రీలు పంపాలి.
- ఏ పురస్కారానికి పంపినది విధిగా రాయాలి.
- తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. వాదోపవాదాలకు తావు లేదు.

కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ: ఏప్రిల్,30, 2023

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను- hasyanandampoteelu@gmail.com

**ఫలితాలు జూన్,2023 హాస్యానందంలో ప్రచురించబడతాయి!**

# ఫర్ సేల్



మల్లాది వెంకట కృష్ణమూర్తి,
9849022344

**వైకుంఠ ఏకాదశి నాడు ఉపవాసం ఉన్నాను. అర్ధరాత్రయ్యేసరికి ఆకలి దంచుతూండడంతో ఇంట్లోంచి బయటికి నడిచాను.**

**చల్లగాలిలో కొద్దిదూరం నడిస్తే నాలో ఆకలి సర్దుకుంటుంది.**

నేను వైష్ణవాలయం పక్కనించి వెళ్తూ ఒకతను దాని తలుపు మీద మేకు కొట్టడం చూసి ఆగాను. అతనా మేకుకి ఓ తెల్లటి బోర్డ్‌ని తగిలించి స్కెచ్ పెన్‌తో 'ఫర్ సేల్' అని రాయడం గమనించాను.

పట్టుబట్టలు ధరించిన అతను ఎంతో పవిత్రంగా కనిపించాడు. అతని ఉత్తరీయం మీద పసుపు మచ్చలు కనిపించాయి.

"ఏం అమ్ముతారు?" అడిగాను.

"ఓ పురాతన ప్రదేశాన్ని!" అతను మృదువైన కంఠంతో జవాబు చెప్పాడు.

కొద్దిసేపాగి విచారంగా చెప్పాడు–

"వాళ్ళు దాన్ని అస్తవ్యస్తం చేసేసారు. ఇక దాన్ని మేనేజ్ చేయడం నావల్లకాదు."

"ఏం జరిగింది?" అడిగాను.

"వాళ్ళకి కామన్‌సెన్స్ ఇచ్చాను... దాన్ని ఉపయోగించడం మానేసారు. క్షమనిచ్చినా ద్వేషాన్ని, ప్రేమని ఇచ్చినా స్వార్థాన్ని పెంచుకున్నారు... ఒక్కరూ న్యాయంగా వ్యవహరించడంలేదు. ఈమధ్య మరీ పెచ్చుపెరిగి, వాళ్ళు చేయని నేరమంటూ లేదు. వాళ్ళు చేసిన కొన్ని పనులు నా ఊహల్లో కూడా రాని చెడ్డ పనులు. మనుషుల్లోని అమానుషత్వం నేను భరించలేను." అతని కంఠంలో విచారం తొంగిచూసింది.

"వాళ్ళెవరైనా కానీండి. కాని వాళ్ళు మీరు చెప్పినంత చెడ్డవారు కారని నా నమ్మకం." ఓదార్పుగా చెప్పాను.

"నేను అబద్ధం చెప్పడంలేదు. హత్య, మానభంగాలు, హింస అన్ని రకాల అవినీతి పనులు, అవిధేయత, అబద్ధాలు, మోసాలు... వారి నేరపూరిత చర్యలు నిత్యం పెరిగిపోతున్నాయి." ఆవేదనగా చెప్పాడు.

"కాని అధైర్యపడకండి... వారు మారే అవకాశం లేకపోలేదు. మనుషులు మారతారు." నేను ధైర్యం చెప్పాను.

అతను జవాబు చెప్పలేదు.

"అదీకాక... మీది కాని ఈ విష్ణాలయాన్ని ఫర్ సేల్ అని రాసి అమ్మడం సిగ్గుచేటు చర్య!" నేను అతన్ని వారిస్తూ చెప్పాను.

అతను నావంక దీర్ఘంగా చూసి, పెద్దగా నిట్టూర్చి...

తర్వాత రెండు పదాలని రాసాడు.

అతను రాసింది మొత్తం చదివాను.


ఫర్ సేల్ బై ఓనర్!

"ఈ ఆలయానికి ఓనర్ని నేను. ఐనా నేను అమ్మాలనుకున్నది ఈ ఆలయాన్ని కాదు. మొదట్లో పవిత్రులు తర్వాత చెడ్డవారిగా మారిన భూగోళాన్ని." చెప్పి అతనా ఆలయంలోకి నడిచాడు.

తక్షణం నా ఒళ్ళు గగుర్పొడిచింది.

గబగబ అతన్ని అనుసరించాను.

ఎంత వెదికినా ఆలయంలో ఆ మనిషి జాడ లేదు. కాకపోతే గర్భగుడిలోని విష్ణుమూర్తి విగ్రహానికి కట్టిన కండువా మీద నాకు పసుపు మరకలు కనిపించాయి.



# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846


## కనిపించని శత్రువులు

శత్రువులకంటే నమ్మక ద్రోహం చేసే మిత్రులతో మనం జాగ్రర్తగా వుండాలి... ఈ మాట ఎందుకు అన్నానో ఈ కథ చదివితే మీకే అర్థం అవుతుంది.

జోగీసింగ్ అనబడే బాగా డబ్బు గల బ్యాచిలర్‌కు రామ్, రాబర్ట్, రహీం అనే దోస్తులు వున్నారు. వీళ్లకు పెళ్లి వయస్సు దాటిపోయి చాలా రోజులైనా పెళ్లి కాలేదు. కారణం వీళ్లేమీ ఒక్కోసారి వీళ్ళకి అవసరం లేకపోయినా అబద్ధాలు చెప్పి జోగీసింగ్ జేబులో నుండి డబ్బులు డ్రా చేస్తుంటారు.

అంచేత జోగీసింగ్‌ని వీళ్ళు ముద్దుగా డెబిట్ కార్డనో... క్రెడిట్ కార్డనో లేదా ఏటీఎమ్ అని పిల్చుకుంటూ వుంటారు.

ఇది ఇలా వుండగా ఒకరోజు రామ్, రాబర్ట్, రహీంలకు అగ్నిపర్వతంలాంటి వార్త తెల్సింది.




వివాహ ద్వేషులు కాదు. ఈ వెధవలకి... సారీ! ఈ అబ్బాయిలకి అమ్మాయిలను ఇచ్చే ధైర్యం మన సౌత్ ఇండియాలో వున్న ఏ పేరెంట్స్‌కీ లేదు. ఎందుకంటే వీళ్ళకు రోజూ తిని, తాగడం తప్ప పని చేసుకునే బతికే అలవాటు శూన్యం.

అమాయకత్వంతో పాటు బాగా డబ్బున్న జోగీసింగ్ ఇన్నోసెన్స్‌ని ఫుల్లుగా వాడుకుంటూ మార్నింగ్ నుండి మిడ్ నైట్ వరకు బార్లకు, రెస్టారెంట్లకు, సినిమాలకూ వెళ్తూ జల్సా చేస్తుంటారు. అంతే కాకుండా అప్పుడప్పుడూ వీళ్ళకు అవసరం ఐతే డబ్బూ కూడా ఇస్తుంటాడు.

అదేంటంటే...జోగీసింగ్‌కు పెళ్లి సంబంధం కుదిరింది అని! అది అగ్నిపర్వతం లాంటి న్యూస్ ఎందుకు అవుతుంది అని మీకు నాకూ అనిపించొచ్చు... కానీ ఆ ముగ్గురికీ మాత్రం అది నిజంగా అగ్నిపర్వతం లాంటి న్యూసే!

ఎందుకంటే జోగీసింగ్‌కు పెళ్లి ఐతే అతడి భార్య వీళ్ళతో బార్లకు, సెకండ్ షో సినిమాలకు పంపదు. అప్పుడు వాళ్ళు తాగడానికి, తినడానికి డబ్బులు ఇచ్చే కుబేరుడున్ని వీళ్ళు మిస్ అవుతారు... అంతే కాకుండా పెళ్లి అయ్యాక జేబు నిండా డబ్బుతో జోగీసింగ్‌ని వాడి పెళ్ళాం చచ్చినా బయటికి పంపదు... దాంతో వీళ్ళకు అవసరం ఐతే డబ్బు ఇచ్చే ఓ వ్యక్తిని కూడా వీళ్ళు కోల్పోతారు.

దీంతో రామ్, రాబర్ట్, రహీం ఒకచోట సమావేశం అయ్యారు.

ఇక వీళ్ళు తమ భవిష్యత్తు అంతా అంధకారమే అని ఇమాజినేషన్ చేసుకుని చిగురుటాకులా వణికిపోయారు.

ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే లాభం లేదనీ ఏదైనా వెధవ ప్లాన్ వేయాలని అనుకున్నారు.

ముగ్గురూ మూడు గంటలపాటు ఆలోచించి మహత్తరమైన ప్లాన్ వేశారు.

అదేంటంటే... బ్యాచ్‌లర్ పార్టీ అని జోగీసింగ్‌ని గోవా తీసుకెళ్ళి అక్కడ వాడికి బాగా మందు తాగిం, తర్వాత ఓ ప్రాస్టిట్యూట్‌ని పిలిపించి వాడి పక్కలో పడుకోబెట్టి... ఆ దృశ్యాన్ని ఫోటోలు తీసి వాడి కాబోయే భార్యామణికి పంపాలి. దాంతో వాడి పెళ్లి క్యాన్సిల్ అయి, పెళ్లి కానీ జోగీసింగ్‌లా మిగిలిపోతాడు. అప్పుడు మన జల్సాలకు లాక్ డౌన్ వుండదు అని అనుకున్నారు.

బ్యాచ్ లర్స్ పార్టీ అనగానే జోగీసింగ్ ఓకే అని రామ్, రాబర్ట్, రహీంని ఫ్లైట్ లో తీసుకుని గోవాలో ల్యాండ్ అయ్యాడు.

వెళ్ళినప్పటినుండి నలుగురూ తింటూ... తాగుతూ వున్నారు. రాత్రయ్యాక జోగీసింగ్‌కు బాగా తాగించారు. దాంతో స్పృహ లేకుండా పడుకున్నాడు... వీళ్ళు అనుకున్నట్టు ఓ ప్రాస్టిట్యూట్‌ని తీసుకొచ్చి సెక్సీగా జోగీసింగ్ పక్కన పడుకో బెట్టి ఫోటోలు తీశారు.

తర్వాత వాటిని జోగీసింగ్‌కు కాబోయే భార్య ప్రమీలకు వాట్స్అప్ చేశారు.

రెండు రోజుల తర్వాత గోవా నుండి నలుగురు ఇంటికి బయలుదేరారు.

ఊర్లో దిగాక జోగీసింగ్ పెళ్లి క్యాన్సిల్ అనే వార్త వినాలని... ముగ్గురూ ఆరు చెవులేసుకుని వెయిటింగ్ చేశారు. కానీ, అలాంటి గుడ్ న్యూస్ వినపడక పోయేసరికి డిజప్పాయింట్ అయ్యారు.

కాసేపట్లో జోగీసింగ్, ప్రమీలల పెళ్లి!

ఆ పెళ్ళికి రామ్, రాబర్ట్, రహీం వచ్చారు.

పెళ్ళికూతురు ప్రమీల మొహంలో ఆనందం

ఓవర్ ఫ్లో అవుతోంది తప్ప... విషాదం ఏమీ లేదు.

ఇది చూసిన ముగ్గురికీ తాము పంపిన ఫోటోలు ప్రమీలకు అందలేదేమోనని డౌట్ వచ్చింది.

జోగీసింగ్, ప్రమీలల పెళ్లి అయిపోయింది.

జోగీసింగ్, ప్రమీలలకు విషెష్ చెప్పడానికి రామ్, రాబర్ట్, రహీం ముగ్గురూ కళ్యాణ మండపం మీదికి వెళ్లారు. వీళ్ళని చూసిన ప్రమీల–

"మా ఆయనలాగే మీరు కూడా గోవాలో... అమ్మాయిలతో బాగా ఎంజాయ్ చేశారా?... మీరు మా ఆయన ఫోటోలు మాత్రమే తీశారా? లేక మీవి కూడా తీసుకున్నారా?" అని నవ్వుతూ అడిగింది.

ముగ్గురూ గిల్ట్‌గా ఫీల్ అయి అక్కడినుండి చిన్నగా జారుకున్నారు.

ఆ ఫోటోలు తామే పంపినట్టు జోగీసింగ్‌కు కూడా తెల్సిపోయుంటుందని ముగ్గురికి అర్థమైంది.

జోగీసింగ్‌కు తమ మొహం ఎలా చూపించాలో అర్థం కాక కొన్ని రోజులు ఊరు వదిలి ముగ్గురూ వెళ్ళిపోయారు.

వాళ్ళు తిరిగి ఊరొచ్చాక జోగీసింగ్, ప్రమీల వెళ్లి ముగ్గుర్ని కలిసి–

"మా పెళ్లి అయ్యాక జోగీసింగ్‌ని మీకు నేను దూరం చేస్తానని భయపడి, మీరు మా పెళ్లి చెడగొట్టాలనుకున్నారు కదూ?" అని ప్రమీల అడిగింది.

దాంతో ముగ్గురు మొహాలు అటు తిప్పుకున్నారు.

"పెళ్లి చూపులరోజే మీ గురించి మా ఆయన నాకు చెప్పి... పెళ్లి అయ్యాక కూడా ఇదివరకు లాగే మీతో సినిమాలకూ, షికార్లకు వెళ్తానని చెప్పాడు. ఆ కండీషన్‌కు నేను ఒప్పుకున్నాకే నన్ను పెళ్లి చేసుకున్నారు!" అని నవ్వితూ అంది.

అవమానంతో జోగీసింగ్ కేసి రామ్, రాబర్ట్, రహీం చూడలేకపోయారు.


## NCCF

North Coastalandhra Cartoonists Forum, Visakhapatnam

**ఆధ్వర్యంలో కార్టూన్ల పోటీ మరియు కార్టూన్ల ప్రదర్శన**

North Coastal Andhra NCCF VISAKHAPATNAM Cartoonists Forum

**శోభకృత్ సంవత్సర ఉగాది సందర్భంగా హాస్యానందం సౌజన్యంతో**

**జాతీయస్థాయి కార్టూన్ పోటీలు NCCF వారు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలో వచ్చిన కార్టూన్లలో అత్యుత్తమమైన ఐదు కార్టూన్లను ఎంపికచేసి ఒక్కోదానికి రూ 1000/- చొప్పున నగదు బహుమతి మరియు ఉత్తమమైన ఐదు కార్టూన్లకు రూ 500/-చొప్పున బహుమతి ఇవ్వనున్నారు.**

**నిబంధనలు:**

- దేశవిదేశాల్లోనున్న తెలుగు కార్టూనిస్టులందరూ పాల్గొనవచ్చును.
- ప్రతీ కార్టూనిస్టు మూడు కార్టూన్ల వరకు పంపవచ్చును.
- కార్టూన్లు A4 సైజులో 300dpi లో jpeg ఫైల్ ఫార్మాట్‌లో కలర్‌లో గానీ/ బ్లాక్ అండ్ వైట్ లో గానీ వేసి పంపాలి.
- మీకు నచ్చిన సబ్జెక్టుపై వినూత్నంగా వేసి, నవ్వించే కార్టూన్లను మాత్రమే పంపండి. కేప్షన్‌లెస్ కార్టూన్లకు ప్రాధాన్యత ఉంటుంది.
- మీ కార్టూన్లను, **20-2-2023,** తేదీలోగా ఈ క్రింది ఈ మెయిల్ కు పంపవలెను.
  **nccfvisakhapatnam@gmail.com**
- బహుమతి పొందిన పది కార్టూన్లు ఏప్రిల్ **2023** హాస్యానందం సంచికలో ప్రచురించబడతాయి.
- పోటీకి వచ్చిన కార్టూన్ల నుంచి బహుమతి పొందినవే కాక, ఇతర మంచి కార్టూన్లు ఎంపికచేసి ఉగాది పర్వదినాన **(22,మార్చి) 'కార్టూన్ల ప్రదర్శన'** విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం జరుగుతుంది.
- ఇతర వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

**టి.ఆర్.బాబు- 9440561425 ✦ లాల్- 9247783307**

అభినందనలు

**హాస్యానందం సౌజన్యంతో ... శ్రీ గుదిబండి వెంకట రెడ్డి నిర్వహించిన కార్టూన్ పోటీలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం!**

**05-02-2023, ఆదివారం ఉదయం10గంటలకు**

**శ్రీ కె.వి.రమణాచారిగారి క్యాంపుకార్యాలయం, ఎ.సి.గార్డ్స్, ఇన్‌కం టాక్స్ టవర్ దగ్గర, మసాబ్‌టాంక్, హైదరాబాద్‌లో జరుగును**

# భార్య భర్తల మధ్య కండిషన్ లవ్



నల్లపాటి సురేంద్ర, 9490792553

**పెళ్లి కోసం పెట్టిన సెలవులన్నీ పూర్తి కావడంతో తప్పని పరిస్థితిలో ఉదయ్ ఆఫీస్‌కి రావాల్సి వచ్చింది.**

**వచ్చి రాగానే "కొత్త కాపురం ఎలా ఉంది?" అంటూ తోటి ఉద్యోగులందరూ ఆట పట్టించారు.**

**సమాధానం చెప్పలేక సిగ్గు పడి పోయాడు ఉదయ్.**

ఇంతలో ఉదయ్ భార్య పవిత్ర ఫోన్ చేసి–"మీరు వెళ్లి మూడు గంటలు అవుతుంది... మిస్ యు శ్రీ వారు అంటూ ప్రేమగా మాట్లాడింది. దీంతో తను చూపే ప్రేమకు, సిగ్గుతో మొగ్గలైపోయాడు ఉదయ్.

ఇదంతా గమనిస్తున్న పక్కనే ఉన్న స్నేహితుడు వికాస్–

"ఇలాంటివి ఎన్నో చూసాము... ముందు ఉంది నీకు మొసళ్ల పండగ!" అంటూ ఉదయ్‌తో వెటకారమాడాడు.

"దేనికైనా సర్దుకు పోవడం తెలియాలి బ్రదర్! తను నా మాటకి విలువ ఇస్తుంది... నా ప్రేమకి వికసిస్తుంది... నా కోసం ఎదురు చూస్తుంది... నేనంటే పడి చస్తుంది..." అంటూ ప్రాసతో కూడిన డైలాగ్ వదిలాడు ఉదయ్.

"నెల రోజులు ఆగు... అప్పుడు నేల మీదకి వస్తావు!..." అంటూ ఉదయ్‌కు వెంటనే చురక అంటించాడు వికాస్.

ఓ పది రోజులు తరవాత ఉదయ్ నిజంగానే చాలా డల్‌గా ఉండటం చూసి– "బ్రదర్. ఏమైంది?" అని అడిగాడు వికాస్.

"నువు నెల రోజులు అన్నావ్!... కానీ పది రోజులకే మా ఆవిడ పెట్టిన కండిషన్లో చిక్కుకున్నాను. నా పుట్టిన రోజు ఎలా చేసుకున్నా, తన పుట్టిన రోజు మాత్రం గ్రాండ్‌గా స్టార్ హోటలులో చేయాలంట. అలాగే నిజాయతీగా ఆఫీస్‌లో జరిగే విషయాలు, పార్టీల గురించి కూడా తనకు చెప్పాలంట. వాట్స్ ఆప్, ఫేస్ బుక్ కొన్ని నిమిషాలు మాత్రమే చూడాలంట. ఊహించని సమయాల్లో తనకు ఊహించని బహుమతులు ఇవ్వాలంట... 'నీ ప్రేమ కొండంతా... నీ మనసు ఉప్పెనంత... నీ కోసం సముద్రాన్ని తెస్తా... ఆకాశాన్ని కూడా నేలకు దించేస్తా!' లాంటి రొమాంటిక్ డైలాగ్స్ చెప్తే, వినే ఓపిక లేదంట. జీవితమంటే ప్రాక్టికల్‌గా ఉండాలంట... అలాగే రాత్రి ఇంటికి ఆలస్యంగా రాకూడదంట. ఒకవేళ వచ్చినా సరైన రీజన్ ఇవ్వాలట. అలాగే ఇంటికి తన ఫ్రెండ్స్ రావచ్చంట... కానీ నా ఫ్రెండ్స్ రాకూడదంట!!" అంటూ వాపోయాడు.

"అరె! ఉదయ్ ఇవి కండిషన్‌లు కాదు. మీ భార్య భర్తల అనుబంధం నూరేళ్ళు కళ కళలాడడానికి చేసే ప్రయోగం!" అన్నాడు వికాస్.

ఈ మాటలేవో కొత్తగా ఉండడంతో, వింతగా వికాస్ వైపు చూసాడు ఉదయ్!

"నా ఉద్దేశంలో ఆమె పెట్టినవి అన్ని మంచి కండీషన్లే. కాస్తా పాజిటివ్‌గా ఆలోచించు!... ఇన్నాళ్లు తన పుట్టిన రోజు ఇంట్లో వాళ్ళతో జరుపుకుంది కదా! ఇప్పుడు నువ్వే తన ప్రపంచం కాబట్టి... నువ్వే తన సర్వస్వం అనుకుంటూ చిలిపిగా పెట్టిన కండిషన్ మాత్రమే అది. రేపు మీకు పిల్లలు పుట్టాక... 'మనకెందుకు పుట్టిన రోజులు... వాటిని పిల్లలకి చేద్దాం' అంటుంది చూడు... ఇక ఆఫీస్ విషయాలు, పార్టీ విషయాలు గురించి ఆమె ఎందుకు అడిగిందంటే... నీకు మేలు చేద్దామనే. నీ ప్రొఫెషనల్ లైఫ్‌లో ఎప్పుడైనా సమస్యలొస్తే, తను ఏమైనా హెల్ప్ చేయగలుగుతుందేమోనని తన తాపత్రయం. అందుకే ఆ కండిషన్... ఇక వాట్స్ ఆప్, ఫేస్‌బుక్ చూసే సమయంలో టైమ్ వేస్ట్ కాకుండా తన వంటకి సాయం చేస్తావని... ప్రేమగా నీకు మరో కండిషన్ పెట్టింది. ఇక సుత్తి లేకుండా స్వచ్ఛమైన భావాలు తనకే తెలపాలని, ఆమె పోకిరి కుర్రాళ్లు వాడే డైలాగ్స్ వాడొద్దంటుంది. అలాగే నువ్వు నీ స్నేహితులకి దూరంగా ఉంటూ... బంధువులకి దగ్గరగా ఉంటే మంచి చెడులు తెలుస్తాయని... పైగా మీ ప్రైవసీకి భంగం కలగదని ఆమె అనుకుంటుంది. పైగా కొత్తగా పెళ్లయిన వాడెవడైనా మగ స్నేహితులను ఇంటికి పిలుస్తాడట్రా. ఇక ఆమె స్నేహితులు ఇంటికి వస్తున్నారంటే...



అమ్మాయిలు బయటకు చెప్పుకోలేని చాలా విషయాలు ఉంటాయి... అందుకే ఆ కండీషన్ పెట్టింది. అంతేగానీ నీ మీద ప్రేమ లేక కాదు! ఇక రాత్రివేళ ఇంటికి పెందలాడే రమ్మం టుంది అంటే, నీ ఆరోగ్యం కోసమే. అంతే తప్ప, ఈ కండీషన్లు నీ జీవితాన్ని శాసిస్తున్నా యని అనుకోకు. నీ మీద ఇంకా ఎక్కువ ప్రేమ పొందాలని ఆమె పెట్టిన కండిషన్లు మాత్రమే అవి!" అన్నాడు సుదీర్ఘంగా స్పీచిస్తూ!

ఆ మాటలకు జ్ఞానోదయం అయినట్లు –

"థాంక్స్ బ్రదర్! తను పెట్టిన కండిషన్లలో అపార్థాలు చూసాను తప్ప, అర్థాలు గమనించ లేదు! ఇక నా భార్య ఏం చెప్పినా, ప్రేమతోనే ఆలోచిస్తా!..." అంటూ ఇంటికి బయలు దేరాడు ఉదయ్.

పక్కనే ఉండి ఈ సంభాషణను ఆసాంతం విన్న రవి కాస్త గందరగోళానికి గురయ్యాడు. వెంటనే వికాస్‌తో– "వికాస్! ఈ కండిషన్‌లు అన్ని ప్రతి ఇంట్లోనూ భార్యలు పెట్టేవే కదా!" అని సందేహం వెలిబుచ్చాడు.

"కొత్తగా పెళ్లి అయినోడు కదా!... అందుకే మనోడు టెన్షన్‌లో ఉన్నాడు... అందుకే పాజిటివ్‌గా చెప్పాను...

తరువాత మెల్లగా అర్థం అవుతుంది... భార్య భర్తల బంధం అంటేనే కండిషన్లతోనే ఇమిడి ఉంటుంది. అదే ఏళ్లు గడుస్తూ ఉంటే చిక్కులు, చికాకులు లేకుండా సంసారం సాఫీగా సాగి పోతుంది... అంతేగానీ, అతిగా ఆలోచిస్తే మనమే ఇబ్బందులలో చిక్కుకుపోతాం. ఏ విష యాన్నైనా ఆలుమగలు ఇద్దరూ అర్థం చేసుకో వడంలోనే ఉంది. లేకపోతే నిరాశలు, నిస్పృ హలు, ఫిర్యాదులు, నిందించుకోవడాలు, తిట్టు కోవడాలు... వీటితోనే జీవితం తెల్లారి పోతుంది.... అలా జరగకుండా ఉండాలంటే కండిషన్లపై కంట్రోల్ ఉండటం ఒక్కటే మార్గం!" అన్నాడు.

✦✦✦

ఉదయ్ వికాస్ ఇచ్చిన పాజిటివ్ ఎనర్జీతో... ఇంటికి వెళ్లగానే పవిత్రను చాలా ప్రేమగా హత్తుకున్నాడు. అమాంతం ఎత్తుకుని తిప్పే శాడు.


"నీ కండిషన్లు నాకు చాలా నచ్చాయి!..." అంటూ సంబరపడ్డాడు.

పవిత్ర కూడా లోలోపల ఆనందించింది.

"పవిత్ర!... నీ కండీషన్లు అన్నీ సూపర్‌గా ఉన్నాయి.... భలే బాగున్నాయి! నాకు తెగ నచ్చేశాయి. కానీ నువ్వు నాకు కండిషన్లు పెట్టి నట్లే... నేను కూడా నీకు కొన్ని కండిషన్లు పెడదామనుకుంటున్నా... నేను ఎప్పటికీ నీ వాడిగానే ఉండాలి కదా మరి!" అంటూ తన అభిప్రాయాన్ని బయటపెట్టాడు...

"నా మీద నువ్వు ఎప్పటికీ తరిగిపోని ప్రేమను వెన్నెల్లా కురిపించాలి. అలాగే నీపైన







నా ప్రేమ తరిగిపోకుండా ఉండాలంటే... నువ్వు సగంలో మానేసిన చదువును పూర్తి చేసేసి, నాతో సమానమైపోవాలి. ఇక నుండి చదువంటే ఇంట్రెస్ట్ లేదు... అని నువ్వనడం కుదరదు. అలాగే నువ్వు అడిగిన ఎల్‌సీడీ టీవీని కచ్చితంగా కొనిస్తా! కానీ రోజూ అదే టీవీలో వచ్చే వంటల ప్రోగ్రామ్స్ చూసి... ఇంచుమించు అలా కాకపోయినా... ఇంకా బాగా చేసేసి నాకు వడ్డించాలి.

ఇక నా జీతం మొత్తం నీ చేతిలో పెట్టేస్తా... కానీ నెల చివర్లో ఖర్చు వివరాలు మొత్తం తప్పుల్లేకుండా టకా టకా చెప్పేయాలి. అలాగే అనవసర ఖర్చులకు నువ్వే బాధ్యత వహించాలి. అలాగే నాకు దేవుడంటే ఎంత భక్తో నీకు తెలుసు కదా... అందుకే ప్రతీరోజు ఉదయానే నాతో కలిసి నువ్వు గుడికి వచ్చేయాలి. అప్పుడప్పుడు పొర్లుదండాలు కూడా పెట్టాలి సుమా! అలాగే నాకు సంఘ సేవ అంటే ఎంతో ఇష్టమని నీకు తెలుసు కదా! సాయంత్రం వీధిలో ఉన్న పిల్లలకి నాతో పాటు, నువ్వు కూడా ట్యూషన్ చెప్పాలి... ఈ కండీషన్లు అన్ని నిజాయతీతో కూడుకున్నవే కదా!" అన్నాడు ఉదయ్.

ఉదయ్ చెప్పిన కండిషన్లకి ఏం చేయాలో తెలియక బిక్క మొహం పెట్టింది పవిత్ర.

"అమ్మో!... ఇప్పుడు మళ్లీ ఈయన కోసం డిగ్రీ పుస్తకాలు మొత్తం బయటకు తీయాలా? అలాగే రోజు గుడికి రమ్మంటాడు ఏమిటి?... ఇక పొర్లుదండాలా? తలచుకుంటేనే ఏదోలా ఉంది... ఇక వంట సంగతి! పెళ్లికి ముందు వంట రాకపోయినా, వంట సూపర్‌గా చేస్తానని మాటిచ్చేశా! ఇప్పుడు టీవీ ప్రోగ్రామ్ లోని వంటలన్నీ నాతోనే ఈయన వండిస్తాడేమో... అలాగే జీతం మొత్తం నాకు ఇచ్చేస్తానని అంటాడేమిటి?... నా బ్యూటీపార్లర్, స్పా ఖర్చులే నెలకి తడిపిమోపెడు అవుతుంటాయి. వచ్చేనెల నుండి వేస్ట్ ఖర్చులని అవి మానేయమంటాడా! ఇక నాకే చదువు తిన్నగా రాదు. నన్ను ట్యూషన్ టీచర్‌ని చేస్తాడేమిటి?!" అంటూ పైకి నవ్వుతున్నా... లోలోపల ఆలోచనలో పడిపోయింది ఆ కొత్త కోడలు పిల్ల.




మొత్తానికి వికాస్ చెప్పిన మాటలు ఉదయ్‌కి ఈ విధంగా పనికొచ్చాయన్న మాట! ఆ మాటలలోని పాజిటివిటీని మరో రకంగా అర్థం చేసుకున్న ఉదయ్, తన స్టైల్‌లో భార్యను కండీషన్లతో ముంచెత్తేశాడు.


ఆలుమగలు ఇద్దరు కండీషన్లు పెట్టుకోవచ్చు. కానీ అందులో నిజాయతీ ఉంటేనే... ప్రేమ, ఆప్యాయతలు అనేవి వారి జీవితాన్ని పరిపూర్ణం చేస్తాయని భావించి... పవిత్రతో కూడా తన మనసులో మాటను కండీషన్ల రూపం బయటపెట్టాడు ఉదయ్.


ఇకముందు జరగబోయేది ఏంటో ఎవరూ ఊహించలేని పరిణామం... ఎవరి కండీషన్లు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో ఆ కాలమే సాక్ష్యం!





# వేలేంటై(వైలె)న్స్ డే...


-శేఖర్
ఎస్.భరద్వాజ..
nagisetty..




# మా అన్నయ్య వచ్చాడు



బొందల నాగేశ్వరరావు, 9500020101

**"ఏమండీ!.. యు.ఎస్ నుంచి అయిదు సూట్‌కేసుల నిండా ఫారిన్ వస్తువులతో మా అన్నయ్య ఉదయాన్నే దిగాడట. ఇప్పుడు మన వద్దకొస్తున్నాడటండీ!... మనకు బోలెడు ఫారిన్ ఐటెమ్సు తెస్తున్నాడట! ఇప్పుడే మా అమ్మ చెప్పింది..." అంటూ భర్త ప్రక్కన కూర్చొంది భార్య శ్రీజ.**


అంతవరకూ లాప్‌టాప్లో పని చేసుకుంటున్న శ్రీకర్ భార్య వంక చూసి– "అయితే నన్నిప్పుడేం చేయమంటావ్?" విసుక్కొన్నాడు.

"అదేటండీ... అలా అంటారు? అయిదేళ్ళ తరువాత ఇండియాకు వస్తున్న మా అన్నయ్య మీకు బావమరది. ఆయనపై మీలో ఒక్కింతైనా ప్రేమ, అభిమానాలు కనబడవేం?" అంటూ రుసరుసలాడింది శ్రీజా.

"ఎందుకు కనబడవే పిచ్చిమొహమా!... రానివ్వు! సాదరంగా రిసీవ్ చేసుకొందాం... ఓకే!" అన్నాడు శ్రీకర్ భార్య కోసం నవ్వుతూ.

ఇద్దరూ బెడ్‌రూంలో నుంచి హాల్లోకొచ్చారు. అంతలో ఇంటి ముందు ఒక ఓలా టాక్సీ వచ్చి ఆగింది.

టాక్సీలో నుంచి ఓ బ్రీఫ్ కేసుతో సినిమా హీరోలా దిగాడు శ్రీజా అన్నయ్య సుశాంత్.




అప్పుడు శ్రీజా ముఖం చాటంతయ్యింది. ముఖం నిండా సంతోషాన్ని పులుముకొని– "రారా అన్నయ్యా!.. పిల్లలు వదిన బాగున్నారా?..." అడిగింది అన్నయ్య చేతిలో వున్న బ్రీఫ్‌కేసును తీసుకొంటూ.

"బాగున్నారు శ్రీజా!" అంటూ తలూపాడు సుశాంత్.

"లోపలికి రండి బావగారూ!" అని సాదరంగా ఆహ్వానించాడు శ్రీకర్.

ముగ్గురూ హాల్లో కూర్చొన్నారు. శ్రీజా గబగబా వెళ్ళి ఫ్రిజ్లో వున్న నీళ్ళ బాటిల్ని తెచ్చి అన్నయ్య చేతికిచ్చింది.

సుశాంత్ కళ్ళకున్న నల్లద్దాలను తీసి జేబులో పెట్టుకొని మంచి నీళ్ళను తాగి... నవ్వుతూ– "శ్రీజా! మీ కోసం ఫారిన్ వస్తువులను తెచ్చానమ్మా!" అంటూ బ్రీఫ్‌కేసును తెరవబోయాడు.

"ఆగరా అన్నయ్యా! వాటిని తరువాత చూసుకొందాం. మొదట భోంచేయ్. అన్నీ నీకిష్టమైనవే వండాను!" అంది శ్రీజా.

"అవును బావగారూ!... మొదట భోంచేయండి!" అన్నాడు శ్రీకర్.

'ఎనిమిది గంటలకు కాఫీ కోసం స్టవ్ వెలిగించిన శ్రీజా గంటన్నర వ్యవధిలో వంటెప్పుడు చేసిందబ్బా?' అని మనసులో అనుకొంటూనే బయటికి చూశాడు. అప్పుడే జొమాటో ఆన్‌లైను అబ్బాయి బైకులో వచ్చి ఆగాడు. శ్రీజా అటూ ఇటూ చూసుకొంటూ వాడి వద్దకెళ్ళి, వాడు అందించిన పెద్ద బ్యాగును తీసుకుని, లోనికెళ్ళింది.

అది చూసిన శ్రీకర్ 'ఓహో! ఇదా సంగతి! అన్నయ్యకు భోజనం ఆన్‌లైన్లో తెప్పించిందన్నమాట' అనుకొని, రెండు నిముషాల తరువాత అటు తిరిగి డైనింగ్ టేబుల్ వంక చూశాడు. అప్పటికే బిరియాని, చపాతి, చిక్కెన్, మట్టన్, రొయ్యల ఫ్రయ్‌లను రెండు ప్లేట్లలో వడ్డించింది శ్రీజా. సుశాంత్ ఓ ప్లేటులో భోంచేస్తున్నాడు.

అన్నయ్య భోంచేస్తున్నది చూసి ఆనందిస్తూన్న శ్రీజా, భర్త శ్రీకర్ కోసం అటు తిరిగి– "ఏమండీ!... మీకూ వడ్డించాను. రండి భోం చేద్దురు!... " అని పిలిచింది ఏదో తడుముకొంటున్నట్టు.

శ్రీకర్ నవ్వుకొంటూ వెళ్ళి కూర్చొన్నాడు.

చెల్లెలు వడ్డించినవన్నీ సుష్టుగా భోంచేసిన సుశాంత్ పెద్దగా త్రేన్చుతూ వాష్ బేసిన్లో చెయ్యి కడుక్కొని, వెళ్ళి సోఫాలో కూర్చొన్నాడు. భర్త శ్రీకర్ కూడా భోజనం చేసి వెళ్ళి సోఫాలో సుశాంత్ పక్కన కూర్చొన్నాడు.

సుశాంత్ మళ్ళీ నల్ల కళ్ళద్దాలను కళ్ళకు తగిలించుకొన్నాడు. స్టయిలుగా బ్రీఫ్ కేసును తెరిచాడు.


"శ్రీజా! నీకు, బావగారికి, పిల్లలకు అమెరికా నుంచి వీటిని తెచ్చానమ్మా" అంటూ ఓ రేబాన్ గ్లాసు, రిస్టువాచి, ఎలక్ట్రానిక్ ఎరోప్లెయిన్, బార్బీ బొమ్మలను తీసి చెల్లెలు చేతికిచ్చి, వచ్చిన పని అర్థగంటలోనే అయిపోయిందన్నట్టు లేచి బ్రీఫ్ కేసును తీసుకొని వెళ్ళి

వెయిటింగులో వుంచిన ఓలా టాక్సీలో కూర్చొన్నాడు.

టాక్సీకదిలింది.


ఇవన్నీ కనురెప్పపాటులో జరిగినట్టు ఫీలయిన చెల్లెలు శ్రీజా షాక్ తిన్నట్టు టాక్సీ వెళుతున్న వేపే చూస్తూ వుంటే....

"షాక్కు గురైనట్టున్నావ్!... ఇదిగో... మీ అన్నయ్య నీ చేతికిచ్చిన ఆ వస్తువులు మన బర్మా బజారులో తెచ్చినట్టున్నాయే శ్రీజా! నాకైతే వాటిని ఫారిన్ నుంచి తెచ్చినవి కావేమోననిపిస్తుంది!" అన్నాడు.





"నాకూ అలానే అనిపిస్తోందండి!... అన్నయ్య రావటం వీటినిచ్చి తిరిగి వెళ్ళిపోవడం, జరిగిందంతా నాకేదో మాయలా అనిపిస్తుందండీ! మీరన్నట్టు ఇవి అమెరికావి కావేమో?!..." అని అంటుండగా అటు రోడ్డు మీద వ్యాపారొకడు సైకిల్ తొక్కుకొంటూ.....

"అమ్మలారా... అయ్యలారా!... మేము ఫారిన్ నుంచి ఇంపోర్టు చేసుకున్న... సెల్‌ఫోన్లు, వాచీలు, కళ్ళద్దాలు, పిల్లల బొమ్మలను తక్కువ ధరకు అమ్ముతున్నాం... రండి... రండి... వెంటనే వచ్చి కొనుక్కోండి! ఆలస్యం చేయకండి!" అంటూ పెద్దగా అరుస్తూ వెళుతుంటే... వాడ్ని చూసిన శ్రీకర్, శ్రీజా దంపతులిద్దరూ ఏడ్వలేక తెగ నవ్వుకున్నారు.



## నవ్వు ఎన్ని విధాలో చూపించే...




**హా**స్యప్రియుల కోసం వచ్చిన మరో మంచి పుస్తకం 'ద బెస్ట్ ఆఫ్ జయదేవ్ కార్టూన్లు'. లెక్చరర్‌గా పనిచేస్తూ కార్టూన్ రంగాన్ని హాబీగా ఏర్పరచుకుని, 1983లో విజయ పత్రికలో హాస్య అనుబంధానికి రథ సారధిగా, 1999లో కలర్ చిప్స్ ఇండియా క్రియేటివ్ డైరెక్టర్‌గా, సినిమాలకు అడ్వర్టైజింగ్ చేసి పేరు సంపాదించారు.

పట్టుదలకు, 60ఏళ్ల నిరంతర కృషి తోడై, అరలక్ష కార్టూన్లను గీయ గలిగారు. ఎంతోమంది కార్టూనిస్టులు జయదేవ్ 'నా గురువు' అని సగర్వంగా చెప్పుకుంటారు. దేశ విదేశాలలో బహుమతులను పొంది బెల్జియంలో జ్యూరీ మెంబర్ అయ్యారు.

'సంతకాలతో సరదాలు' లాంటి కొత్త ప్రయోగాలు చేయడం వీరికే సాధ్యమైంది. విందు భోజనాల్లో ఎంతో ఇష్టమైన వంటకాలు వడ్డించినా కొన్నే తింటాం. మొహం మొత్తుతుంది. జయదేవ్‌గారి కార్టూన్లు ఎన్ని చదివినా ఇంకా కావాలంటాం. వేలాది కార్టూన్లలో వారికి ఇష్టమైన కొన్ని కార్టూన్లను ఎంపిక చేసి ప్రచురించిన పుస్తకమే 'ద బెస్ట్ ఆఫ్ జయదేవ్ కార్టూన్లు'.

ఈ పుస్తకం ద్వారా జయదేవ్‌గారి కార్టూన్‌లను ఒకచోట చూడ గలుగుతున్నాం. ఈ పుస్తకం కార్టూన్లు ఎలా వేయాలో నేర్పిస్తుంది.

ఓర్పుతో సమాధానాలు ఇవ్వడం ఒక్క గురువులకే సాధ్యం. కార్టూన్ గురువుగా అంతులేని పేరు పొందారు జయదేవ్.


వాట్సప్ ఫేస్బుక్ మెయిల్స్ వచ్చాక కార్టూనిస్టులకు మరింత దగ్గరై పాఠాలు నేర్పుతున్నారు.

ఈ పుస్తకంలో 300కు పైగా కలర్ కార్టూన్లు ఉన్నాయి. వీటిలో కొన్ని నవ్వించేవైతే, మరికొన్ని ఆలోచింపజేసేవి. కార్టూన్ కళ పర మార్థం ఏమిటో ఈ కార్టూన్లు మనకి బోధిస్తాయి.

ఈ పుస్తకాన్ని యువ బుక్స్ వారు ప్రచురించారు.

**దీని ధర రూ.500/-లు.** ఈ పుస్తకం కావాలనుకునేవారు- 9486633443 నెంబరుకు సంప్రదించండి.




**మొ**దటి తెలుగు మహిళా కార్టూనిస్టుగా పేరుగాంచి... వేలాది కార్టూన్లు గీశారు కుమారి రాగతి పండరి. వీరి కార్టూన్లను ఇష్టపడని తెలుగు పాఠకు లుండరు. వీరిది ఒక ప్రత్యేక శైలి. తన చుట్టూ ఉన్న సమాజంలోని మంచి చెడ్డలను కార్టూన్లలో వ్యంగ్యంగా హాస్యంగా ఎత్తి చూపేవారు.

ఇప్పటితరం వారికి అప్పటి పండరి కార్టూన్లు చూడడం సాధ్యం కాదు. మరి చూడ్డం ఎలా?... అదే ఆలోచన శ్రీబ్నిం గారికి రావటం, కార్టూనిస్టు కీర్తిశేషులు శ్రీరామకృష్ణగారి అమ్మాయి సునీతగారు కార్టూనిస్ట్ రామకృష్ణ ఫౌండేషన్ స్థాపించి, సమర్పించిన ఈ పుస్తకం, హాస్యానందం వారు ప్రచురించారు. ఇది మెచ్చుకోదగ్గ విషయం.

దాదాపు 200 కార్టూన్లు ఉన్న ఈ పుస్తకం నిజంగా నవ్వుల విందే. వచ్చిన ఐడియాలను కార్టూన్‌గా మలచిన తీరు అద్భుతం. రాజకీయ నాయకులు, దొంగలు, రౌడీలు, మొగుడు పెళ్ళాలు, సినిమాలు, ఆషాఢ మాసం... ఇలా ఏ అంశాన్ని ఎన్నిసార్లు తీసుకుని గీసినా కొత్త కొత్త ఐడియాలతో కార్టూన్‌లను పండించారు రాగతి పండరి. సమాజాన్ని ఎంత సునిశితంగా గమనించి కార్టూన్లు వేసేవారో ఇందులో కార్టూన్లు చూస్తే తెలుస్తుంది. పదేళ్ళక్రితం వేసిన కార్టూన్లు ఇప్పటి సమాజాన్ని కూడా ప్రతిబింబిస్తున్నాయంటే ఆవిడ సృజనాత్మక దృష్టికి జోహార్లు. కొత్తగా నేర్చుకునే వారికి ఈ నవ్వులవిందు ఒక పాఠ్య గ్రంథం లాంటిది.

కార్టూనిస్టులకే అభిమాన కార్టూనిస్టు అయిన ఈ మహిళా కార్టూనిస్టు నేడు మన మధ్య లేకున్నా వారి కార్టూన్లు చూసిన వారు ఎవరైనా నవ్వుల నదిలో ఓలలాడాల్సిందే. కార్టూన్ పేరు చెప్పగానే మొన్నటి, నేటి, రేపటి తరం దాకా గుర్తు చేసుకునే ఒకే ఒక్క మహిళా కార్టూనిస్టు కుమారి రాగతి పండరి. వీరి కార్టూన్లు సిరీస్ పుస్తకాలుగా రావాల్సిన అవసరం ఉంది. కార్టూన్ పుస్తకాలను బహుమతులుగా ఇస్తే పుస్తకాలు చదవని వారు కూడా పాఠకులుగా మారిపోతారు. ఈ 'నవ్వు' వైరస్‌ని అందరికీ వ్యాపింపజేసి... 'నవ్వు' వలన కలిగే లాభాలను అందిద్దాం!

హాస్యానందం ప్రచురణగా వచ్చిన ఈ 'నవ్వుల విందు' కావాలను కునేవారు 125 రూపాయలు, 9849630637 ఫోన్‌కి గూగుల్‌పే / ఫోన్‌పే చేసి, రిజిష్టర్ పోస్ట్‌లో మీ నవ్వులవిందుని అందుకోండి!

సమీక్ష: **డా॥ రావెళ్ళ శ్రీనివాసరావు**

# త్రిసహస్ర కవితా సమ్మేళనం



పి.ఎన్.బి.యస్.శ్రీనివాస్, 9989646639

**"ఏవండోయ్.. ఈ ప్రకటన చూశారా?!" అంటూ గావుకేక పెడుతూ ఇంట్లో నుండి అరుగు మీద కూర్చున్న భర్త కసిరెడ్డి దగ్గరికి వచ్చింది జాతరమ్మ.**

**"ఏంటే... అంత వింత ప్రకటన?!" ఆశ్చర్యంగా అడిగాడు కసిరెడ్డి.**

**"ఇదిగో! మీరే చూడండి!" అంటూ జాతరమ్మ పేపరు చేతికి అందించింది. కళ్ళజోడు సరిచేసుకుంటూ పేపర్లోకి ముఖం పెట్టి మరీ చూసాడు ఆ ప్రకటనను కసిరెడ్డి.**

'కోనసీమ జిల్లాలో అంబాజీపేట గ్రామంలో త్రిసహస్ర కవితా సమ్మేళనం ఘనంగా జరగబోతోంది... అందరూ ఆహ్వానితులే!... మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు కలవు... దూరం నుండి వచ్చే కవులకు కవయిత్రులకు రూమ్ ఫెసిలిటీ కూడా కలదు. ఆసక్తిగల కవులు ముందుగా తమ పేర్లను ఈ క్రింది నెంబర్‌కి వాట్సాప్ పంపి రిజిస్టర్ చేసుకోవలెను.' అంటూ ప్రకటన ఇచ్చారు నిర్వాహకులు.


"మంచి కార్యక్రమమే నిర్వహిస్తున్నారు... పైగా రుసుము కూడా లేదు... భోజనం ఏర్పాట్లతో పాటు దూరం నుండి వచ్చే వారికి రూమ్ ఫెసిలిటీ కూడా ఇస్తామంటున్నారు! ఇంకెందుకు ఆలస్యం మన కవితా ప్రవాహాన్ని అక్కడ పొంగిద్దాం!" అన్నాడు కసిరెడ్డి.


కసిరెడ్డికి చిన్నప్పటి నుండి కవితల పిచ్చి! కనిపించిన ప్రతి విషయంపై ఏదో ఒక కవిత రాసేయడం పత్రికలకు పంపేయడం చేస్తూ ఉండేవాడు. రాయలసీమ జిల్లాకు చెందిన ప్రసిద్ధ కవినని అతని ఫీలింగ్. సాహిత్య అభిలాష కలిగిన అమ్మాయిని పెళ్ళాడాలని తెగ ఎదురుచూసి ఎదురుచూసి ముదిరిపోయిన తర్వాత జాతరమ్మను పెళ్ళాడాడు.

జాతరమ్మ కూడా ఏమీ తక్కువ కాదు... వంట చేస్తూ బట్టలు ఉతుకుతూ కూడా కవిత్వం చెప్పేస్తుంది... ఇద్దరుకిద్దరూ సరిపోయారు... అనుకున్నారు పెళ్లికి వచ్చిన ఇరువైపులా బంధువులు.

జాతరమ్మ వారి తల్లిదండ్రులకు సొంత కూతురు కాదు... పిల్లలు లేని వారికి జాతరలో దొరికింది... పిల్లను ఎవరైనా సరే ఎప్పుడూ అగౌరవంగా మాట్లాడకూడదని భావించిన తల్లిదండ్రులు జాతరమ్మ అని పేరు పెట్టారు.

ఆ విధంగా కసిరెడ్డి దగ్గర కూడా పేరుతోనే పిలిపించుకుని గౌరవం పొందుతుంది జాతరమ్మ.






"త్రిసహస్ర కవితా సమ్మేళనం... అంటే మాటలా? కవిత్వం ఏరులై పారుతుంది... అక్కడికి వచ్చిన వారంతా మన కవితలు గురించే గొప్పగా మాట్లాడుకోవాలి ఆ విధంగా కవిత సిద్ధం చేసుకో!..." అన్నాడు భార్యతో కసిరెడ్డి.

"మీరేమీ ఖంగారుపడకండి! నేను ఆల్రెడీ పత్రికల నుంచి తిరిగి వచ్చిన కవితలను రిపేర్ చేసి పట్టుచీరల మధ్య పెట్టి ఉంచాను. వాటిని ప్రచురించే భాగ్యం పత్రికలకు లేకపోయినా వినే భాగ్యం... త్రిసహస్ర జనానికి ఉంది కాబోలు!" అంది గొప్పగా.

"ఇక మీ విషయం చూసుకోండి!" కసిరెడ్డికి గుర్తుచేసింది జాతరమ్మ.

"నువ్వేమీ హైరానాపడకు కసి కసిగా కొద్ది ఏళ్ళుగా కవిత్వం రాస్తున్న నాకు ఈ సమ్మేళనం ఓ లెక్క! ట్రైన్‌జర్నీలో అయినా రాసి పడేస్తాను. ప్రయాణంలో అయితే కంటెంట్కి కొదవే ముంటుంది?! మహాకవి శ్రీశ్రీ ఏం చెప్పారు? 'కాదేదీ కవితకు అనర్హం!' అన్నారు కదా! అందుకే అప్పటికప్పుడు వేడిగానైనా వండి వడ్డించగల సత్తా ఉన్న కవిని నేను!" అన్నాడు ఓవర్ కాన్ఫిడెన్స్‌తో.

"ఆరు నూరైనా నూరు ఆరైనా... త్రిసహస్ర సమ్మేళనంలో సన్మానం అందుకోవాల్సిందే!" డబుల్ కాన్ఫిడెన్స్‌తో చెప్పింది జాతరమ్మ. వ




"మూడువేల మంది కవులలో మన స్పెషాలిటీ చూపించాలి!" అన్నాడు మరింత కసిగా కసిరెడ్డి.

"ఇంకెందుకు ఆలస్యం! వాట్సప్ ద్వారా పేర్లు నమోదు చేసి ప్రయాణానికి ట్రైన్ టికెట్స్ బుక్ చేయండి!" ఆర్డర్ వేసింది.

సమ్మేళనానికి ముందురోజే ట్రైన్ ఎక్కారు.

పదింటికల్లా ఫంక్షన్‌హాల్ చేరుకున్నారు.

ఫంక్షన్ హాలంతా చాలా బిజీగా ఉంది. ఎక్కడ చూసినా భుజాన పొడవాటి సంచులు వేలాడ దీసుకుని తిరుగుతున్నారు కవులు.

త్రిసహస్ర కవితా సమ్మేళనం స్టేజ్ అదిరిపోయింది. ఒక పుంజాడు జడ్జీలు ఆసీనులైఉన్నారు. కవులు స్టేజి ఎక్కిన వెంటనే ఎడమ వైపు ఎరేంజ్ చేసిన మైకు దగ్గరికి వెళ్లి వారు వచ్చిన ప్రదేశం, వారి పేరు, చదవబోయే కవిత పేరు... చెప్పి కవిత చదవాలని చెప్పాడు నిర్వాహకులలో ఒకరు.

ఆల్రెడీ రిజిస్టర్ చేసుకున్న నెంబర్ ప్రకారం నిర్వాహకులు ఒక్కొక్కరిని పిలుస్తున్నారు.

ప్రతి ఒక్కరూ పైకి ఎక్కి, సభకు నమస్కారం చెప్పి కవిత మొదలుపెడుతున్నారు.

కవితా ప్రవాహం జోరుగా సాగుతోంది... కానీ స్టేజ్ కింద ఆసీనులైనవారు ఎవరూ కవితలను వినడం లేదు... ఎవరి పనిలో వారు బిజీగా ఉన్నారు... కొందరైతే సెల్ ఫోన్ చూసుకుంటున్నారు. మరికొందరు పాత పరిచయా

లను తిరగతోడుకుని జెబ్బలు చరుచుకుంటున్నారు. ఏమైనప్పటికీ ఒక కవిత చెప్పడం ముగిసే సరికి విధిగా చప్పట్లు కొట్టడం మాత్రం చేస్తున్నారు.



నవ్వు కొమ్మచ్చి




ఇదంతా గమనిస్తున్న కసిరెడ్డికి తనవంతు వచ్చే టైం అయ్యింది... ఎప్పటినుండో తనకు సాహితీ మిత్రుడైన మూర్తి కోసం ఎదురు చూస్తున్నాడు. తాను కవిత చదివితే వినడానికయినా ఒకరు ఉండాలి కదా! అనుకుంటూ ఉండగా కసిరెడ్డి పేరును మైకులో పిలిచారు నిర్వాహకులు. జనంలో జాతరమ్మ ఎక్కడ ఉందా? అని వెతుక్కుంటూనే స్టేజీ ఎక్కాడు కసిరెడ్డి.

రాత్రంతా కుస్తీలు పట్టి ట్రైన్‌లో రాసుకున్న కవితను సాగదీస్తూ... చదువుతున్నాడు కసిరెడ్డి.

ఓ పక్క కన్ను మూర్తి కోసం... మరోపక్క కన్ను జాతరమ్మకోసం వెదుకుతున్నాయి. కవితలో చివరి లైన్స్ వచ్చేశాయి... అంతలో మెరుపులా కనిపించాడు మూర్తి!

వెంటనే హమ్మయ్య! అనుకున్నాడు.

కవిత చదవడం పూర్తయ్యేటప్పటికి కవుల వైపు కూర్చున్న మూర్తి కొట్టే చప్పట్లు కవయిత్రుల వైపు జాతరమ్మ కొట్టే చప్పట్లు కసిరెడ్డికి ఆనందాన్నిచ్చాయి.

ధన్యోస్మి అంటూ స్టేజి దిగాడు.

స్టేజ్ దిగీదిగటంతోనే మూర్తిని ఆలింగనం చేసుకుని కుశలప్రశ్నలు వేసాడు.

"ఎలా ఉంది నా కవిత?" అంటూ అడిగాడు... "నేను చివరిలో వచ్చాను ఆ లైన్స్ ఉన్నాయి చూడండి బ్రహ్మాండంగా ఉన్నాయి... మీరు మాత్రం తప్పనిసరిగా నా కవిత మొత్తం వినాలి సుమా!" ఎందుకైనా మంచిదని రిక్వెస్ట్ పెట్టాడు తెలివిగా మూర్తి.

"ఎంతమాట! మీరు చెప్పాలా? తప్పకుండా వింటాను!" అన్నాడు కసిరెడ్డి.

త్రిసహస్ర కవితా సమ్మేళనంలో లంచ్ బ్రేక్ ఇచ్చేసరికి ఫంక్షన్‌హాలు బయట తోటలో వేసిన భోజనాల పందిరి దగ్గరకు అందరూ పరిగెత్తారు. అక్కడ మగవారికి ఒక లైను ఆడవారికి ఒక లైను బారుగా ఉన్నాయి. ఆకలి దంచేస్తున్న కసిరెడ్డికి ప్లేటులో అన్నం పెట్టి... ఓ వైపు పప్పు మామిడికాయ మరోవైపు గోంగూర చట్నీ ఇంకోవైపు మునక్కాయ కూర వేసాడు వడ్డించేవాడు.

అవి చూసి కసిరెడ్డికి నీరసం వచ్చింది.

"ఏంటయ్యా ఇవి! మీ ఊరు అంటే పులస చేప పులుసు ఉంటుందేమో... అనుకున్నా!" వడ్డించేవానిపై కసిరినట్టు అన్నాడు కసిరెడ్డి.

"ఆయ్! మీరు అనుకుంది కరెక్టేనండి కానీ నాన్‌వెజ్ తింటే నాలిక పెళుసు పడిపోయి కయిత్వం దెబ్బతింటుందని వద్దన్నారండి!" అన్నాడు పక్కన ఉన్న ఓ నిర్వాహకుడు.

"అంటే... పప్పుతింటే కవిత్వం బలంగా ఉంటుందా ఏంటి?!" సీరియస్‌గా ఫేస్ పెట్టి అడిగాడు కసిరెడ్డి.

"అదేమో తెలియదుగానండి! హాలు దద్దరిల్లిపోవాలని ఆర్డర్ వేయడంతో పప్పు పెట్టాల్సి వచ్చింది!" అన్నాడు నిర్వాహకుడు.

కాసేపటికి మళ్ళీ మొదలయ్యింది త్రిసహస్ర కవితా సమ్మేళనం... ఈసారి కొందరైతే కుర్చీలలో కునుపాట్లు పడుతున్నారు.

మొత్తానికి సాయంత్రానికి ప్రోగ్రాం పూర్త



యింది. నిర్వాహకులు అనుకున్న కార్యక్రమం గ్రాండ్‌గా జరిగిందని ప్రెస్‌మీట్‌లో తెగ పొంగిపోయారు.

మరికాసేపట్లో త్రిసహస్ర కవితా సమ్మేళనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్స్ ప్రదానం ఉంటుందని అనౌన్స్ చేసారు నిర్వాహకులు.

'సన్మానం ఉంటుందనుకుంటే సర్టిఫికెట్‌తో సరిపెడుతున్నారేంటి'... అనుకుంటూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. 'సరే! ఏం చేస్తాం సచ్చినోడు పెళ్ళికి వచ్చిందే కట్నం' అనుకుంటూ సరిపెట్టుకున్నారు ఇద్దరు.


కసిరెడ్డి జాతరమ్మలు సర్టిఫికెట్‌లు అందుకున్నారు. తీరాచూస్తే ఆ సర్టిఫికెట్‌లపై ఏ వివరాలు లేవు... కనీసం పేరు రాయాల్సిన చోట కూడా ఖాళీగానే ఉంది.

అవి చూసి ఇద్దరూ అవాక్కయ్యారు!

ఎలాగు వివరాలు రాయలేదు కదా! మరో రెండు ఎమ్టీ సర్టిఫికెట్లు తీసుకుంటే ఘనంగా చెప్పుకోవచ్చని నిర్వాహకులను అడిగాడు కసిరెడ్డి.

"భలేవారే కవిగారు!... ఈ సర్టిఫికెట్ ఒక్క దానికి యాభై రూపాయలు ఖర్చయింది. మీరు వంద రూపాయలు ఇస్తే... మరో రెండు ఇస్తాను!" అన్నాడు నిర్వాహకుడు.

ఆ మాటకు రాయలసీమ పౌరుషం పొంగుకొచ్చిన కసిరెడ్డి తన దగ్గరున్న రెండు సర్టిఫికెట్లను ఇచ్చేస్తాను వందరూపాయలు ఇవ్వండి అనగానే ఖంగుతిన్నాడు నిర్వాహకుడు.




ఇంతలో– 'దూరప్రాంతాల నుండి వచ్చిన వారు కౌంటర్ దగ్గరకు వచ్చి రూమ్ కీ తీసుకోవాల్సింద'ని మైక్‌లో అనౌన్స్‌మెంట్ వినిపించింది. చాలామంది అక్కడకు పరిగెత్తారు.

ఉన్నవి పదిహేను కీలు... రూమ్స్ చాలా పెద్దవి.. కాబట్టి ఒక్కొక్క రూములో ఇరవై నుండి ముప్పై మంది సర్దుకోవాలని చెప్పేసరికి అందరికీ నాడులు జారిపోయాయి. వీటిలో కవయిత్రులకు సగం రూమ్స్ కేటాయించారు.

జాతరమ్మ అటువైపు పరిగెత్తగా... కసిరెడ్డి మరో వైపు పరిగెత్తాడు. ఏ రూమ్ ముందు చూసినా ఇరవై నుండి ముప్పై జతల చెప్పులు దర్శనమిస్తున్నాయి. అప్పటికే అలసిపోయి వున్న కసిరెడ్డికి సడన్‌గా మూర్తి గుర్తుకు వచ్చి, ఫోన్ చేసాడు. కసిరెడ్డి కాల్ లిఫ్ట్ చేసిన మూర్తి రూమ్ నెంబర్12కి రమ్మన్నాడు.

వేగంగా ఆ రూమ్‌కి వెళ్ళాడు కసిరెడ్డి. తీరా చూస్తే ఆ రూమ్ బయట కూడా ముప్పై జతల వరకు చెప్పులు కనిపించాయి. అవి చూసి నీరసం వచ్చినా, చేసేదేమీలేక తలుపు తట్టాడు కసిరెడ్డి.

డోర్ తీసి తీయడంతోనే గబుక్కున చేయి పట్టి లోపలికి లాగి డోర్ మూసాడు మూర్తి.

ఆ సంఘటనకు కంగారుపడ్డాడు కసిరెడ్డి.


తీరా లోపల చూస్తే మూర్తి తప్ప ఎవ్వరూ లేరు. కసిరెడ్డి ఆశ్చర్యపోయాడు.

"ఏంటి?!... బయట చూస్తే అన్ని జతల చెప్పులు ఉన్నాయి. లోపల ఎవరు లేరు ఇదెలా సాధ్యం?" అడిగాడు.

"ఏముంది! ఆ చెప్పులు పక్క రూమ్ వాళ్ళవి ఇటువైపు జరిపాను, దాంతో ఆ రూమ్ ఫుల్ అయిపోయి మనకి ఈ ఫెసిలిటీ దొరికింది. కవిత్వంలో తృప్తి ఎలాగూ లేదు... కనీసం తృప్తిగా నిద్రయినా పోదాం! అన్నాడు మూర్తి.

మూర్తి తెలివితేటలతో మురిసిపోయిన కసిరెడ్డి, ఒళ్ళంతా హూనం కావడంతో ఆ రాత్రి తనివితీరా నిద్ర పోయాడు. జాతరమ్మ పరిస్థితి మాత్రం జాతరలాగే ఉంది.

మొత్తమ్మీద త్రిసహస్ర కవితా సమ్మేళనం కసిరెడ్డి, జాతరల పాలిట సమ్మెట పోటులా మారగా... కుయ్యో మొర్రో అంటూ ఊరు చేరారు ఈ కవిద్వయం!



# మర్చిపోలేని బహుమతి



-మాధవి బైటారు,+97433952728

**"ఏంటోయ్ అల్లుడు!... సంచి పట్టుకు బయల్దేరావు?... చికెన్ అదీ... వద్దులే గానీ..." అని పాపారావు అనగానే- 'హమ్మయ్య! రక్షించాడు ఏ వంకాయలో, బెండకాయలో తేవచ్చు!...' మనస్సులో సంబరపడిపోతూ అనుకున్నాడు సుందరం.**

"మొన్న మంగళవారం మటన్, మర్నాడు బుధవారం చికెన్ తిన్నాం కదా! ఈ రోజు ఏ వంజరమో, రొయ్యలో తీసుకురా..." అని లిస్ట్ చెప్పి "అవునూ... ఇప్పుడు పులస దొరుకుతుందేం టోయ్!" అని పాపారావు ఆరా తీశాడు.

'నిన్న ఒక్కరోజు బ్రేక్ ఇచ్చి ఈరోజు మళ్ళీ నాన్ వెజ్ కావాలా, ఈయన ఆస్తి తనకి రావడం దేవుడెరుగు. తన బేంక్ బాలన్స్ మాత్రం ఖాళీ అయిపోతుంది' అని మనస్సులో తెగ గింజుకుని... 'అయినా ఈయనకి నేను అల్లుడినా, నాకు ఈయన అల్లుడా? సంక్రాంతికని పిలవడానికొచ్చి పదిరోజుల నుండి తిష్ట వేసి, రోజుకో చాంతాడంత లిస్ట్ చేతిలో పెడుతున్నాడు.' అని పళ్లు పటపటా కొరుక్కున్నాడు.

"ఇప్పుడు దొరకవు సీజన్ కాదు కదా!" వినయంగా పైకి అన్నా 'ఒకవేళ అవి దొరికినా చచ్చినా తేను... వాటిని కొనాలంటే నేనేది అమ్ముకోవాలో...' అనుకున్నాడు సుందరం.

"సర్లే... సర్లే! వచ్చేటప్పుడు పుల్లారెడ్డి స్వీట్స్ ఓ ఐదు కేజీలు పట్టుకొచ్చేయ్... ఓ నాల్రోజులు పంటికిందకు పడి ఉంటాయి."

అని పాపారావు అనగానే ...'ఐదు కేజీల స్వీట్సా... ఎందుకు పడి ఉండవు తేరగా వస్తే...' బావురుమన్నాడు సుందరం.


ఎర్రగా బుర్రగా ఉన్న ఒక్కగానొక్క కూతురు, పైగా మావగారు పిసినారితనంతో కొన్ని కోట్లు కూడబెట్టుంటారని, బంధువుల చెప్పిన గుసగుసలతో రేప్పొద్దున్న ఆస్తి అంతా తనకే వస్తుందనే ఆశతో వనజని పెళ్లి చేసుకున్నాడు.

అందుకే ఏనాడూ తనకి ఏది పెట్టకపోయినా, కోట్ల ఆస్తి అంతా తనదే కదా అనే భ్రమలో బతుకుతున్నాడు సుందరం.

డిశెంబర్ 30 న కూతురింటికి వచ్చి, కొత్త సంవత్సర సంబరాలు అక్కడే జరుపుకుని... సంక్రాంతి ఇంకా నాలుగురోజులు ఉందనగా బయలుదేరారు పాపారావు, శాంతమ్మ.

ఒక్కగానొక్క కూతుర్ని వదిలి ఉండలేమంటూ... ఇలా వచ్చి కొన్నాళ్లుండి సుందరం జేబుకు చిల్లులు చేయడం అలవాటే.

వెళ్ళేముందు సుందరంతో- "నువ్వూ, అమ్మాయి కలిసి పండగకి తొందరగా వచ్చేయాలోయ్!" అని పాపారావు అనగానే...



'మీరే ఇప్పుడు వెళ్తుంటే మేమెప్పుడు వచ్చిచచ్చేది!' గొణుక్కున్నాడు సుందరం.

"అఁ!... చెప్పడం మర్చిపోయాను. ఈసారి పండక్కి బట్టలూ అవీ కాకుండా నీకో అపురూపమైన వస్తువు ఇవ్వాలనుకుంటున్నానోయ్!" అనగానే చేటంత మొహం చేసుకుని–

"ఏంటది మామగారు!..." అని చిన్నపిల్లాడిలా ఎక్సైటింగ్‌గా అడిగాడు సుందరం.

"తినబోతు రుచెందుకు?..." అని పాపారావు ఊరిస్తున్నట్లు నవ్వగా...


'అయినా ఇన్నాళ్ళు ఏది ఇవ్వని మామగారు అపురూపమైన వస్తువు ఇస్తానంటున్నారంటే, ఒకేసారి అన్నీ కలిపి ఇవ్వబోతున్నారేమో... ఏ హార్లేడేవిడ్సన్ బైకో అయ్యింటుంది' అనుకుని వనజ వెనక్కి కూచుని తనని గాట్టిగా పట్టుకుంటే ఫుల్‌స్పీడ్‌లో రైడ్ చేస్తున్నట్లు ఊహాలోకంలో విహరించి...

"పోనీ రంగు గురించి అయినా... క్లూ ఇవ్వండి, మామగారు!" అని గోముగా అడిగేసరికి...

"బంగారం లాంటిదే అనుకో!" అనగానే...

'మెడలో గొలుసు, చేతికి బ్రేస్లెట్ అయ్యింటాయని' ఊహించుకుని 'పోనిలే గుడ్డిలో మెల్ల... ఏదో ఒక వస్తువు పిసినారి మామగారి దగ్గర నుండి అందుకోబోతున్నాడు ఈ సంక్రాంతికి' అనుకుని–

"సరే... వస్తామ"ని హుషారుగా చెప్పాడు పాపారావుతో.




"సంక్రాంతినాడు ఉదయం మనింటి పెద్దలకు దండం పెట్టుకుని, మధ్యాహ్నం బయలుదేరొచ్చు కదరా!" అని తల్లి సణుగుతున్నా, వినిపించుకోకుండా... భోగి ముందురోజే ప్రయాణం కట్టాడు ఆత్రం పట్టలేని సుందరం.

"ఇచ్చట గారెల పిండి, దోశల పిండి రుబ్బబడును!" అని బోర్డ్ పెట్టి ఉన్న మామగారి ఇంటికి చేరేసరికి...

"రండి... రండి! అల్లుడుగారు! మీ కోసమే ఎదురుచూస్తున్నాం!" అంటూ పాపారావు ఎదురొచ్చి కాళ్ళు, చేతులు కడుక్కోవడానికి నీళ్లిచ్చి– "ఏమోయ్ శాంతం!... కూతురు, అల్లుడు వస్తారని నిన్నంత తెగ హైరానా పడిపోతూ ఆ జంతికలు ఏవో చేశావు కదా! అవి తీసుకురా..." అని పురమాయించేసరికి వంటగదిలో... "ఖర్మ... ఖర్మ..." అని తల కొట్టుకుంటూ– "తినండి బాబు!" అంటూ పళ్ళెంలో జంతికలు తెచ్చింది శాంతమ్మ.


సుందరం మాంచి ఆకలి మీద ఉండి ఆవురావురుమని తినేసి మరి కొంచెం పెడతారేమో అని ఆశగా చూశాడు కానీ శాంతమ్మ మళ్ళీ రాకపోయేసరికి... 'రేపు పెడతార్లే' అని తనకు తాను సముదాయించుకున్నాడు.

కానీ సుందరానికి తెలియని విషయం ఏమిటంటే... పిసినిగొట్టు పాపారావు ఏది చెయ్యనిస్తాడో, లేదో అని శాంతమ్మ మీద జాలితో పక్కింటావిడ ఆ జంతికలను ఇచ్చిందని.

భోగి రోజు ఏ బెల్లం అరిసలో, పరమాన్నమో ఎక్స్పెక్ట్ చేశాడు కానీ నీళ్ళు లాంటి పప్పుచారుతోనే పెట్టేసరికి–'సర్లే... రేపు ఎక్కువ రకాలు వండుతారు కాబోలు' అనుకున్నాడు.

సంక్రాంతి రోజు ఇరుగుపొరుగు వారు వచ్చి నానబెట్టిన మినపప్పును మామగారి ఇంట్లో గ్రైండర్‌లో గారెల కోసం రుబ్బించుకోగా, వాళ్ళు చూడకుండా ముందే కొంత పిండి దాచిపెట్టి శాంతమ్మకి ఇవ్వగా, దాంతో ఆవిడ చేసిన గారెలు... పాపం పాపారావు పొట్టకే సరిపోలేదు.

'అఁ!... ఈ గారెలతో ఏముంది? రేపు కనుమనాడు మాంచి నాటుకోడికూర, బిర్యానీతో పట్టుపడితే అబ్బబ్బా!...' తలచుకుంటేనే నోరూరిపోతుంది సుందరానికి.



కనుమ రోజు ఉదయం పదయినా పాపారావు బజారుకి వెళ్ళి ఏదైనా తెచ్చే సూచనలు కనిపించడం లేదు.

ఇక లాభం లేదనుకుని– "మామయ్య, మీకిక్కడ మంచి నాటుకోళ్ళు దొరుకుతాయటగా. తేవడానికి నన్నూ సాయం రమ్మంటారా?..." అనగానే– 'అయ్యో! నాటుకోడి తింటే వేడి చేసి నీకు అజీర్ణం, కడుపు నొప్పి వచ్చాయనుకో అల్లుడూ... మా అమ్మాయే కదా నీకు చాకిరీ చెయ్యాలి! ఆ ఇబ్బందులేవి మీరు పడకూడదని వాము, మిరియాలు వేసి మాంచి ఘాటుగా చారు చెయ్యమన్నాను ఈ పూటకి!" అన్నాడు చిద్విలాసంగా నవ్వుతూ.

ఆ మాట వినగానే ఒక్కసారిగా నీరసపడిపోయి... 'మా ఇంటికి వస్తే కుంభకర్ణుడిలా నానా తిండి కడుపులో పడేసుకుని... ఇప్పుడు నాకు పెట్టడానికి నానా కారణాలు చెప్తావా?' గొణుక్కుని...

'సర్లే...తిండిదేముంది... ఎప్పుడైనా తినొచ్చు! ముందు ఆ గిఫ్ట్ సంగతి అడగాలి!' అనుకుంటూ... "ఈ సస్పెన్స్ భరించలేకపోతున్నాను మామయ్య! నాకివ్వబోయే గిఫ్ట్ బీరువాలో ఉందా? లేకపోతే పట్నం వెళ్ళి తెచ్చుకోవాలా?!" అనగానే...

"అబ్బెబ్బే... ఇంట్లోనే భద్రంగా ఉంది!" అంటూ... "అయినా కంగా రెందుకు? రేపు మీరు బయలుదేరేముందు తప్పకుండా ఇస్తానుగా!" ఊరిస్తూ అన్నాడు పాపారావు.

ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు సుందరానికి. భార్య వనజను హింట్ ఇమ్మన్నాడు కానీ, తనకి తెలియదనేసింది. తండ్రి పిసినిగొట్టుతనం తెలిసిన ఆమెకి, తండ్రి ఏమిస్తాడో ఆ తర్వాత అత్తగారితో ఎన్ని మాటలు పడాలో అని గుబులుగా ఉంది.

మర్నాడు సుందరం, వనజలు బయలుదేరుతున్నామని చెప్పి, హాల్లోకి లగేజ్ తెచ్చుకున్నారు. చాలా ఎక్సైటింగ్‌గా ఉన్న సుందరం 'మామ గారు ఇచ్చిన బహుమతిని రేపు ఆఫీస్‌లో అందరికీ చూపించి కాలరెగరెయ్యాలి' అని మురిసి పోతున్నాడు.

శాంతమ్మ కూతురికి బొట్టు పెట్టి పసుపుకుంకాలు ఇచ్చింది.

ఇక సుందరం వంతు ...

తన హార్ట్ బీట్ తనకే వినిపిస్తుండగా...

"ఇదిగోనోయ్, నీ బహుమతి!" అంటూ పాపారావు ఇస్తున్న సంచిని గబుక్కున పట్టుకున్నాడు సుందరం.

'చిన్నదేదో అనుకుంటే ఇంత బరువుంది. లోపలేముందబ్బా...' అని ఆత్రంగా తెరిచిచూసి కళ్ళు తేలేశాడు.

పాపారావు మీసం మెలేసి నవ్వుతూ– "నాకు తెలుసోయ్... నువ్వింత ఆనందంతో షాక్ అవుతావని!" అంటూ దాన్ని జాగ్రత్తగా బయటికి తీశాడు.

చింతపండు, పీతాంబరి పౌడర్ వేసి తోమగా తళతళ మెరిసిపోతున్న మరచెంబు అది.

గర్వంగా దానిని సుందరం చేతిలో పెడుతుంటే "దీనిని నేనేం చేసుకోను మామయ్య!" అని ఏడుపు మొఖంతో అడిగాడు. అటువంటిది అల్లుడికి బహుమతిగా ఇస్తారని కలలో కూడా ఊహించని సుందరం.

## హాస్య బ్రహ్మలు

ప్రభాకర్ అంతోటి





**ప**ద్మశ్రీ అవార్డు పొందిన మొదటి తెలుగు హాస్యనటులు– రేలంగిగా పేరు గాంచిన రేలంగి వెంకట్రామయ్య!

హాస్యం అపహాస్యం కాకుండా ప్రత్యేకమైన టైమింగ్‌తో ప్రేక్షకులని గిలిగింతలు పెట్టిన గొప్ప హాస్య నటులు శ్రీ రేలంగి! తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం సమీపంలో రావులపాడు గ్రామంలో రామదాసు, అచ్చయ్యమ్మ, దంపతులకు జన్మించాడు. తండ్రి హరి కథ, సంగీతం నేర్పించేవారు. చిన్నతనంలో తండ్రి దగ్గర ఈ విద్యలు నేర్చుకున్నాడు. ప్లేబాక్ సింగర్‌గా ఎన్నో పాటలను కూడా పాడారు. తెలుగు చిత్రసీమలో తిరుగులేని హాస్య నటునిగా గుర్తింపుపొందిన రేలంగి ఎప్పటికీ చిరస్మరణీయులు!

"అదేంటోయ్! అలా అంటావు... దీని వెనక ఎంత చరిత్ర ఉందను కున్నావు. మా తాతల నాటి నుండి జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాం... మా బామ్మ, అమ్మ... అందరూ పుణ్యక్షేత్రాలకు వెళ్ళేటప్పుడు దీన్నే తీసుకువెళ్ళేవారు. అందుకే మా ఇంట్లో ఎంతో విలువైనది ఇదే!" అని గొప్పగా వర్ణిస్తుంటే...

పిసినారి మామ నుండి ఖరీదైన బహుమతి ఆశించిన తనకు ఈ శాస్తి జరగాల్సిందే... అని మరచెంబుతో టపీటపీమని తల మీద కొట్టుకుంటుంటే...

"ఏంటమ్మా, ఇది?" అని ఏడుపు మొహంతో వనజ, తల్లికి సైగ చేసేసరికి...

"నా బాధలు ఎవరికి చెప్పుకోను. అంతా మన ఖర్మ!" అంటూ తల కొట్టుకుంది శాంతమ్మ.







**రచయిత, కార్టూనిస్టు డా॥ రావెళ్ళ**

## ఫన్ ప్రశ్నలకు-

ప్రముఖ హాస్య నటులు **సుదర్శనమ్**

## పంచ్ సమాధానాలు

*Cartoons: Sangram*



✦ ఆరేసుకోబోయి పారేసుకోవడం అంటే...?

**నాటి, కాలం చెల్లిన పైట మా(పా)ట అది! ఆరేసుకోవటానికి, పారేసు కోవటానికి... ఉంటేగా ఇప్పుడు?**



✦ ఆడది ఆదిశక్తి మరి మగాడు?

**పెద్ద పులి!**



✦ పెళ్ళెందుకు?... మీ స్టైల్లో 'అబ్బా' అన్నట్లు చెప్పండి!

**అది ఉన్నందుకు... అబ్బా! అదేనండీ సాంప్రదాయం!!**

✦ సంసారంలో సరిగమలు ఎప్పుడన్నా పాడుకున్నారా?

**సంసారంలో సరిగమలేం ఖర్మ... కాపురంలో కీర్తనలే పాడుకున్నాం! కచేరిలూ చేసుకున్నాం!!**





✦ ఆడదంటే అలుసు...వంటింటి పులుసు... దానికేం తెలుసు... మెల్లో గొలుసు... ఈ కవిత పొడిగించండి చూద్దాం?

**ఇది ఇంట్లో పాడితే ఏం జరుగుతుందో... మీకూ తెలుసు...నాకూ తెలుసు... ఒంట్లో మిగలదు ఒక్క ముదుసు!! (సున్నంలోకి ఒక్క ఎముక మిగలదని అర్థం)**

✦ వేరే గ్రహం నుండి వచ్చిన అమ్మాయి మిమ్మల్ని పెళ్లాడతానని పట్టుబట్టి కూర్చుంటే ఏం చేస్తారు?

**పట్టుబట్టేదాక ఆగను...ప(క)ట్టు బట్టలతో, రెక్కలు కట్టుకొని ఆ గ్రహానికి ఎగిరిపోతాను! (రెక్కలెక్కడివని పిచ్చి ప్రశ్నలు అడక్కండి... పట్టుబట్టిన ఆ పడతే తెస్తుంది... ఇంకో జత రెక్కలు)**



✦ రాత్రికి రాత్రి అంతా జంబలకడిపంబలైపోతే?
**మీ కోరిక తీరిపోతుంది!!**



✦ వాయువేగంతో వార్తలు గ్రహాలన్నింటికీ చేరాలంటే?
**'ఆడ'శాటిలైట్స్‌ని వాడాలి...!**
**గాలి వార్తలన్నీ... సారీ 'గాలి వేగంతో వార్తలన్నీ' గ్రహాలకి చేరిపోతాయి!**







✦ కాలుజారితే తీసుకోవచ్చు మరి చేయి జారితే....?
**తీసుకోక తప్పదు!**

✦ కళ్ళకు కనిపించని గ్రహం ఏది?
**ఆగ్రహం!... కళ్ళకి కనిపించదు... కళ్ళలో కనిపిస్తుంది!!**







✦ అసలు స్వర్గలోకం ఉందంటారా?
**నాకుంది...**
**మీ సంగతెలీదు!**


✦ అందరికీ నచ్చే బడి ఏది చెప్పుకోండి?
**రాబడి! పలుకుబడి!!**





✦ షూట్ చేసినా శిక్ష పడని వాడు?
**కెమేరామేన్!**

✦ రెండు కాళ్ళకు వేలాడేది?
**వేలాడే వాటి గురించి నేను పట్టించుకోను! (అయినా నాకు తెలీక అడుగుతాను... మీరు కార్టూనిస్టా, పొడుపు కథల స్పెషలిస్టా??)**



# 'బహుమతుల' ప్రదాన మహోత్సవం



హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన శ్రీమతి గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ...

శ్రీకొయిలాడ వెంకు నాయుడు స్మారక హాస్య ఉత్తరాల పోటీ...

రామ్‌కుమార్స్ దయాబెటిక్ అకాడమీ నిర్వహించిన 'చక్కెరకేళి' ఎస్.ఎమ్.ఎస్. పోటీలలో విజేతలకు బహుమతులు...

యనమండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, వెంకట లక్ష్మి స్మారక పురస్కారం ప్రదానోత్సవం వైభవంగా జరిగింది.

జనవరి, 26న, సాయంకాలం, విజయవాడ, బందరురోడ్డులోనున్న 'బాలోత్సవ భవన్‌లో' జరిగిన ఈ కార్యక్రమంలో కార్టూనిస్టులు, కార్టూనిష్టులు హాస్య రచయితలు, హాస్యప్రియులు పాల్గొన్నారు.

ఈ సభకు ముఖ్య అతిథులుగా– ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ అడ్వకేట్– శ్రీ వై.వెంకట రవి ప్రసాద్, ప్రఖ్యాత కార్టూనిస్ట్–శ్రీ బాచి, హాస్యానందం ఎడిటర్– శ్రీ రాము.పి, కార్టూనిస్ట్, కార్టూన్ పోటీ నిర్వాహకులు– శ్రీపద్మదాస్, పింక్విల్లా సినీ వెబ్‌సైట్ డిప్యుటి ఎడిటర్– శ్రీ బాబు కొయిలాడ, చక్కెరకేళి పోటీ నిర్వహకులు డాక్టర్ రామ్ కుమార్ గార్లు పాల్గొన్నారు.

శ్రీరవిప్రసాద్ మాట్లాడుతూ– ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఎదుర్కొనే ఒత్తిడిని కార్టూన్లు తొలగిస్తాయి అన్నారు.

కార్టూనిస్ట్ శ్రీబాచి మాట్లాడుతూ– యువతరాన్ని కార్టూన్ గీసే దిశగా ప్రోత్సహించటం కోసం త్వరలో కాలేజీలు, పాఠశాలల్లో కార్టూన్ వర్క్ షాపులు నిర్వహిస్తామని చెప్పారు.




యనమండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, వెంకటలక్ష్మి స్మారక పురస్కార గ్రహీత-శ్రీ గోపాలకృష్ణ

హాస్యానందం సంపాదకులు శ్రీరాము– కార్టూనిస్టుల ప్రోత్సాహం కోసం పత్రిక నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు.

అనంతరం యనమండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, వెంకటలక్ష్మి స్మారక పురస్కారం కార్టూనిస్టు గోపాలకృష్ణగారికి అందజేసారు.

శ్రీమతి గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీలో... కోయిలాడ వెంకు నాయుడు స్మారక హాస్య ఉత్తరాల పోటీలో... డాక్టర్ రామ్ కుమార్ దయాబెటిక్ అకాడమీ నిర్వహించిన ఎస్.ఎం.ఎస్ పోటీలో గెలుపొందిన వారికి అతిథులు బహుమతులు అందించారు.

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ పాలక మండలి సభ్యులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ సభని ఆద్యాంతం ఆహ్లాదంగా నిర్వహించారు.

–మనోజ్ కుమార్

## శ్రీమతి గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ బహుమతి ప్రదానం



మొదటి బహుమతి-కుమారి ఎన్.ధీరజ



రెండవ బహుమతి- శ్రీ శంబంగి



జ్యూరీ బహుమతి- శ్రీ ప్రసాద్ కాజ



జ్యూరీ బహుమతి- శ్రీశేఖర్



జ్యూరీ బహుమతి- శ్రీసునీల్



జ్యూరీ బహుమతి- శ్రీఆనంద్ గుడి

## శ్రీకొయిలాడ వెంకునాయుడుస్మారక హాస్య ఉత్తరాల పోటీ బహుమతి ప్రదానం



శ్రీ జి.రంగబాబు



శ్రీగంగాధర్ వడ్లమన్నాటి



శ్రీఆచంట సుధాకర్

**శ్రీ వూటుకూరి సుబ్బారావుగారి స్మారకంగా రామ్‌కుమార్స్ డయాబెటిస్ అకాడమీ & డాక్టర్స్ స్మైల్‌క్లబ్ వారు నిర్వహించిన ఎస్.ఎమ్.ఎస్. పోటీ బహుమతి ప్రదానం**



డా.రావెళ్ల



శ్రీమతి యలమర్తి చంద్రకళా



శ్రీ ఎన్. సునీల్ బాబు



శ్రీ అల్లూరు శివకోటేశ్వరరావు



చి॥ ఎమ్.భార్గవి ప్రియ



చి॥ ఎమ్. గౌతమి షణ్ముఖ ప్రియ



శ్రీ రవి శంబంగి(శంబంగి)

# తూనీగా... తూనీగా...



గండ్రకోట సూర్యనారాయణ శర్మ,
9666903960

**'మనసంతా నువ్వే' సినిమాలో 'తూనీగా... తూనీగా...' అన్న పాట వినాయకం మనసులో బాగా ముద్రపడిపోయింది. ఆ సినిమాలో చూపించినట్లే స్కూల్లోనే ఒక అమ్మాయిని ప్రేమించి, పెద్దయ్యాక ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవాలనే కోరిక బలంగా నాటుకుపోయింది.**

అందుకే పదో తరగతి చదువుతుండగా స్కూల్లో తన పక్కనే బెంచీలో కూర్చునే రెండు జళ్ళ సీతకి ట్రై చేశాడు. కానీ ఆ అమ్మాయి 'బేరు'మని ఏడుస్తూ వాళ్ళ పెద్దవాళ్ళకు చెప్పటం, వాళ్లొచ్చి ఇతనికి దేహశుద్ధి చేయబోవటంతో ఆ ప్రయత్నం బెడిసికొట్టింది.

కనీసం కాలేజీ చదివేటప్పుడైనా వీలవుతుందేమోనని చూశాడు... కానీ అక్కడి అమ్మాయిల ఫాస్ట్‌నెస్ చూసి బెదిరిపోయాడు... చివరికి ఉద్యోగం చేస్తూ, తన కొలీగ్‌నెవరినైనా ప్రేమిద్దామనుకుని... ఇద్దరు ముగ్గురికి ట్రై చేశాడు... కానీ వాళ్ళ గొంతెమ్మ కోరికలు చూసి బెంబేలెత్తిపోయాడు.

అతడి కోరిక గురించి తెలిసిన అతని తల్లి– "ఒరే వినాయకం! నీ మరదలు మన మంగతాయార్ని చేసుకోరా!... అదెంత చక్కగా ఉందనుకుంటున్నావ్? నువ్వనుకున్నట్టే చిన్నప్పుడది నీతోబాటే స్కూల్లో చదివింది. కాబట్టి దాన్ని చేసుకుంటే నీ కోరిక తీరిపోతుంది. అదీ పెద్ద చదువే చదివిందిగా!" అంది.

"మామ్! ఎంత చదువు చదివినా మంగతాయారుని చూస్తే నాకు ఆ ఫీల్ కలగలేదు. అంతేకాదు. దానికీ నామీద అంతా ఇంట్రెస్ట్ ఉన్నట్టు అనిపించలేదు. ఎప్పటికైనా నేను పెళ్లంటూ చేసుకుంటే లవ్ మ్యారేజే చేసుకుంటా!" నిష్కర్షగా చెప్పేశాడు.

✦✦✦

సంబంధం కుదిరితే కొన్నాళ్ళు ప్రేమించి, ఆ తర్వాత పెళ్లి చేసుకోవచ్చనుకుని, ఒక ప్రఖ్యాత మాట్రిమోనీకి డబ్బు కట్టి, కాస్త అందంగా కనిపించిన అమ్మాయిలకు ఫోన్ నంబర్లు తీసుకుని, తన అక్కా బావలతో కూర్చుని, ఫోన్ చెయ్యటానికి పూనుకున్నాడు.

మొట్టమొదటి కాల్ అందుకున్న అమ్మాయి తండ్రి– "మీదే నక్షత్రం?" అని అడిగాడు.

అతడు చెప్పగానే "ఓ అదా!... ఆ నక్షత్రమైతే మా అమ్మాయికి కుదరదు!" అంటూ ఠపీమని ఫోన్ పెట్టేశాడు.

"ఈయనే ఒక పెద్ద సిద్ధాంతిలాగా ఉన్నాడే..." అన్నాడతడి బావ.

రెండో ఫోన్ కాల్ వాళ్ళ అక్క చేసింది. అవతల్నుంచి అమ్మాయి వాళ్ళ అమ్మ లైన్లోకి వచ్చింది... తన తమ్ముడి గురించి ఈమె వివరించబోతుండగా మధ్యలోనే ఆవిడ కల్పించుకుని–


"మీ బ్రదర్ ప్యాకేజీ హౌమచ్చీ?" అనడిగింది.

ఈమె చెప్పగానే– "మా బేబీకి అంతకు డబల్ శాలరీ కమింగ్. మీ వాడు మా బేబీకి నాట్ సూటబుల్!" అంటూ ఫోన్ పెట్టేసింది.

ఆవిడ ఇంగ్లీషుకీ, ఆవిడ దాబుసరికీ వినాయకం అక్క బిత్తరపోయింది.

ఆ తర్వాత చేసిన మూడు కాల్స్ అందుకున్న అవతలివాళ్ళు కొద్దిగా నిదానంగా మాట్లాడటంతో ఊపిరి పీల్చుకున్నారు ముగ్గురూ.

ఆ అమ్మాయిల వివరాలన్నీ అడిగి తీసుకున్నారు.




మొదట అమ్మాయితో పెళ్ళి చూపులు ఏర్పాటయ్యాయి. వాళ్ళు కాస్త గౌరవంగానే వ్యవహరించారు. అంతా అయ్యాక...

"మా అమ్మాయి అబ్బాయితో మాట్లాడుతుందట!" అంది అమ్మాయి తల్లి.

వినాయకం సంతోషంగా లోపలికెళ్ళాడు.

అయితే అతడికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఆ అమ్మాయే అతడ్ని ఇంటర్వ్యూ చెయ్యటం మొదలుపెట్టింది... అతడి ఊరు, ఆస్తి వివరాలు అన్నీ అడిగింది.

తర్వాత– "మనిద్దరం ఉద్యోగులం కదా! మన పెళ్ళయ్యాక మీ పేరెంట్స్ మాటిమాటికి మనింటికొస్తే మనకెంత ఇబ్బంది? వాళ్ళకి మా అమ్మ వండి వార్చలేదు!" అంది తాపీగా.

అతడు విస్తుపోయి– “మన యింట్లో మీ అమ్మగారెందుకు వంట చేస్తారు?” అనడిగాడు.

“మన పెళ్ళయ్యాక మా అమ్మ మనతోనేగా ఉండేది. డాడీ చాలా బిజీ కాబట్టి అప్పుడప్పుడు అంటే... నెలకి జస్ట్ నాలుగైదుసార్లు వచ్చి, ఐదారు రోజులుండి వెళ్ళిపోతారు. ఒక్కగానొక్క కూతుర్నిగదా! నన్ను చూడకుండా వాళ్ళుండలేరు!” అంది.

అతడు అయోమయంగా అమెవైపు చూశాడు.

‘నెలకి నాలుగైదుసార్లు వచ్చి, ఐదారు రోజులుంటాడా? అంటే నెలంతా నా కొంపలోనే తిష్ట వేస్తాడన్నమాట!’ అనుకున్నాడు.

మళ్ళీ ఆమె– “నేను చెప్పినవి గుర్తుంచుకోండి. అట్లాగే మన ఆస్తిలో మీ అక్కకి వాటా ఇస్తానంటూ గొప్పలు పోకండి. మనకి పుట్టే పిల్లల కోసం మన ఎంతో కొంత వెనకెయ్యాలిగదా... అదీగాక...” ఇంకా ఆమె చెప్పబోతుండగా అతడు దిగ్గున లేచి, ఇప్పుడే వస్తానంటూ బయటకు ఉడాయించాడు.

✦✦✦

ఆ తర్వాత రెండో సంబంధం పిల్లని చూడటానికి వెళ్ళాడు. అమ్మాయి ఒక ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్.

అతడు ప్రశ్నలు వెయ్యటం అయ్యాక ఆమె–

“మీకేయే లాంగ్వేజ్‌లు వచ్చు?” అని అడిగింది.

అతడు తడుముకోకుండా–

“ఐ నో టెల్గూ అండ్ ఇంగ్లీష్ వెరీవెల్. హిందీ కూడా తోడా తోడా వచ్చు!” అన్నాడు.

ఆమె పకపకా నవ్వి–

“నేనడిగింది ఆ లాంగ్వేజీలు కాదు. జావా, సీ లాంగ్వేజ్ లాంటివి!” అంది.

ఆ మాట వినగానే అతని గుండె గుభేలుమంది. ఇంజనీరింగ్ చదివే రోజుల్లో ఒరాకిల్ అతనికొక పెద్ద మిరాకిల్లా అనిపించేది. జావా అన్నమాట వినగానే జావగారిపోయేవాడు. ఇక సీ లాంగ్వేజ్ అంటే చాలు అరేబియన్ సీలో పడ్డట్లు ఊపిరాడేది కాదతనికి...

ఎలాగోలా అప్పుడు తంటాలు పడి ఇంజనీరింగ్ పూర్తి చేశాడు.

ఇప్పుడీ అమ్మాయి మళ్ళీ తనకి ఆ టెస్టులన్నీ పెట్టి, ప్యాసయితేగానీ పెళ్ళి చేసుకోదా ఏమిటి? ఏదో స్టూడెంటుని అడిగినట్లు ఏమిటీ ప్రశ్నలు?’ అని చికాకు పడిపోయాడు.

ఇంకొంచెంసేపు అక్కడే ఉంటే ఆ లెక్చరర్ పిల్ల ఇంజనీరింగ్ సబ్జెక్టు లన్నీ మళ్ళీ తిరగతోడి, తన తిత్తి తీసేటట్లుందని భయమేసిందతనికి.

అంతే!... చటుక్కున లేచి– “ఇప్పుడే వస్తా!” అంటూ అక్కడ్నుంచి బయటికి ఒహటే పరుగు.

✦✦✦

ఇహ మూడో సంబంధం దాదాపుగా ఓకే అయ్యింది. చివరగా అతడు ఆమెతో పర్సనల్‌గా మాట్లాడతానంటే ఆమె పక్క గదిలోకి దారితీసింది. చాలా విషయాలు మాట్లాడిందామె.



"మీ పేరేదో గమ్మత్తుగా అనిపించింది. మళ్ళీ చెప్పండి. మర్చిపోయాను." అన్నాడు.

"నా పేరు చిత్రగుప్త!" అందా అమ్మాయి.

"ఏమిటీ చిత్రగుప్తనా?" కెవ్వుమని అరిచినంత పనిచేశాడు.

ఆమె విచిత్రంగా చూసి– "ఇందులో అంత అరవటానికేముంది?... నా పేరు చిత్ర. మాది చంద్రగుప్తుడి వంశం... అందుకే మా వంశం పేరు 'గుప్త'ని నా పేరు చివర తగిలించుకున్నాను... మా వంశమంటే నాకు ప్రాణం మరి!" అందా అమ్మాయి.


"మీకు మీ వంశమంటే ప్రేమ ఉండొచ్చు గానీ, కావాలంటే మీ నాన్న వెంకటేశంగారి పేరు కలుపుకుని 'చిత్రా వెంకటేశ్' అని పెట్టుకోండి. అంతేగానీ యముడి దగ్గర చిట్టా పద్దులు రాసే ఆ చిత్రగుప్తుడి పేరు పెట్టుకోవటమేమిటి?" అన్నాడు వికారంగా మొహం పెట్టి.

"షటప్! నా పేరు నా ఇష్టం... నా పేరు గురించి ఇంకో మాట మాట్లాడితే ఊరుకోను!"

"ఓకే ఓకే. రేపు పెళ్ళయ్యాక మీ పేరు 'చిత్రా వినయ్' అని మార్చుకోవచ్చులెండి" అన్నాడు.

"న్నో! న్నో!! నేనెప్పటికి 'చిత్ర గుప్త'నే. పేరు మార్చుకునే ప్రసక్తే లేదు. ఐ లవ్ మై నేమ్!" అందా అమ్మాయి తన్మయత్వంగా.

పెళ్లి చూపుల్లోనే ఇంత మొండిగా ఉందంటే ఇక పెళ్లయ్యాక ఎట్లా ఉంటుందో ఊహించుకోవటానికే భయపడిపోయాడు. అంతే! అక్కడ్నుంచి తోక ఝాడించేశాడు.




ఇక అక్కడనుంచి సీన్ రివర్సయింది. పొడుగు తక్కువని ఒకరూ, రంగు తక్కువని ఒకరూ, తక్కువ స్టాండర్డ్ కాలేజీలో చదివాడని మరొకరూ, పని చేసే కంపెనీ చాలా చిన్నదని ఇంకొకరూ రకరకాల కారణాలతో అమ్మాయిలే అతన్ని తిప్పికొట్టసాగారు.

ఒక్కో అమ్మాయి అలా అతన్ని అలా తిరస్కరిస్తూ ఉండటంతో, ప్రేమించి పెళ్ళి చేసుకోవాలంటూ పట్టుబట్టి కూర్చున్న వినాయకం కోరిక క్రమంగా కరిగిపోసాగింది. చివరికి 'పెళ్లయిన తర్వాతైనా ప్రేమించుకోవచ్చు... అసలు అమ్మాయి దొరికితే చాలు' అన్న దశకి జారిపోయాడు.

✦✦✦

ఒకరోజు పురోహితుడొకాయన దగ్గరికి వచ్చి– "చూడు నాయినా! ఇంతకుముందు నేన్నీకు చాలా సంబంధాలు చూశాను. అవి కుదరలేదు... ఇప్పుడు నా దగ్గర ఒక చక్కని సంబంధం మిగిలింది... అది నీకు తప్పక కుదురుతుందని నా నమ్మకం. నువ్వొప్పుకుంటే ఈ సంబంధం ఖాయమయ్యేట్లు చూస్తా. కానీ నాకు సంభావన మాత్రం భారీగా ఇవ్వాల్సి వుంటుంది!" అన్నాడు.

"అమ్మాయి నాకు నచ్చి, నా పెళ్లి కుదరాలే గానీ మీరనుకున్నదానికన్నా డబల్ సంభావన మీకు పూలల్లో పెట్టి ఇస్తా!"


"మరింకేం. నేను వాళ్ళతో మాట్లాడి పెళ్ళి చూపులకు ఏర్పాట్లు చేసి... నీకు కబురు చేస్తాను!" అంటూ వెళ్ళిపోయాడతడు.

మర్నాడు అతడే ఫోన్ చేసి– "బాబూ! వాళ్ళకి నీ గురించి అంతా చెప్పాను. వాళ్ళు పెళ్ళిచూపులకి సుముఖంగా ఉన్నారు. మీరు రెడీ అంటే మనం వెళ్దాం!" అన్నాడు.

✦✦✦

పెళ్ళిచూపులకోసం అతని అక్కాబావలతో పాటు అతని తల్లిదండ్రులు కూడా బయల్దేరి వెళ్ళారు.

అందరూ కార్లో వాళ్ళింటికి చేరుకున్నారు. వీళ్ళను చూస్తూనే పంతులుగారు ఎదురొచ్చి– "వచ్చారా! రండి రండి. మీరిలా కూర్చోండి. అమ్మాయి తరఫువాళ్ళంతా లోపల అమ్మాయికి అలంకరణ చేస్తున్నారు!" అంటూ వాళ్ళని



అక్కడున్న సోఫాలో కూర్చోమని చెప్పి, లోపల గదిలో ఉన్న ఆడపెళ్ళివాళ్ళకి వినబడేటట్లుగా–"అమ్మా! ఇదిగో అబ్బాయివాళ్ళు వచ్చేశారు. త్వరగా తెమలండి తల్లీ. మళ్ళీ వర్జ్యం వచ్చేస్తుంది" అంటూ కేకేశాడు.

పావుగంట తర్వాత బయటికొచ్చిన ముత్తైదువలు... వినాయకం కుటుంబాన్ని చూడగానే వాళ్ళ దగ్గరికి వెళ్ళి ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం మొదలుపెట్టారు.

ఏదో ఆలోచిస్తూ కూర్చున్న వినాయకం అకస్మాత్తుగా తన ఎదురుగా ఉన్న సోఫాలో ఇద్దరమ్మాయిలు ప్రత్యక్షమవటంతో ఉలిక్కిపడ్డాడు.

అందులో ఒకరు తన మరదలు మంగతాయారు కావటం చూసి విస్తుపోయాడు... ఆ ఇద్దరిలో ఎవరు పెళ్ళికూతురో అతనికి అర్థం కాలేదు. అందుకే అయోమయంగా వాళ్ళవైపు చూశాడు.

ఇంతలో అతని మరదలు అతనికేసి చూసి– "ఏం బావా! నన్ను గుర్తుపట్టలేదా? నీ మరదలు మంగతాయార్ని. నేనే పెళ్ళికూతుర్ని. ఎప్పటికైనా నన్ను చేసుకోక తప్పదు నీకు!" అంది నవ్వుతూ.

ఆ మాటలు వింటూనే అతడు ఆశ్చర్యపోయి, అయోమయంగా ఆమెనే చూస్తుండిపోయాడు.

అంతలో ఆమె పక్కనున్న బంగారు బొమ్మలా మరో అమ్మాయి అతన్ని చిరుకోపంతో చూస్తూ– "మీరు పెళ్ళి చూపులు చూడటానికి వచ్చింది నన్ను. దీన్ని చూస్తారేం? ఒకర్ని చూడటానికి వచ్చి ఇంకొకర్ని చూడటం మీకు భావ్యమా?" అంది.

దాంతో అతని అయోమయం రెట్టింపయ్యింది. 'ఈ ఇద్దరిలో అసలు పెళ్ళికూతురు?' ఎవరు అన్నట్లు పంతులుగారివైపు చూశాడు.

అతని అవస్థ చూసి ఆ ఇద్దరమ్మాయిలూ పకపకా నవ్వసాగారు.

ఇంతలో ఒక ముసలావిడ కల్పించుకుని– "అబ్బాయిని ఆటపట్టించింది చాల్లెండే... ఇద్దరూ ఇద్దరే!" అని విసుక్కుని, అతని పక్కన కూర్చుంటూ– "చూడు నాయినా! నీతోబాటే స్కూల్లో చదివిన పిల్లని చేసుకోవాలని కోరిక కదూ. ఇదిగో ఇది ఉందే.. నా మనవరాలు.




ఇదెవరనుకున్నావు? స్కూల్లో నీ పక్కనే కూర్చునే రెండు జళ్ళ సీత. గుర్తుందా? అదే ఇది. చేసుకుంటే నిన్నే చేసుకుంటానని భీష్మించుకు కూర్చుంది. అందుకే మేము పంతులుగార్ని నీదగ్గరికి పంపాం. అదే అసలు పెళ్లి కూతురు. ఇక నీ మరదలు కేవలం నిన్ను ఆట పట్టించటానికే వచ్చింది. ఎంతైనా వీళ్ళిద్దరూ చిన్నప్పటినుంచీ స్నేహితురాళ్ళు కదా!" అంది.




మంగతాయారు లేచి వచ్చి, వినాయకానికి షేక్ హ్యాండ్ ఇస్తూ– "మొత్తానికీ నీ తూనీగ లవ్ సక్సెస్ అయినందుకు కంగ్రాట్స్ బావా!" అంది చిలిపిగా.

ఆ మాటలు విన్న పంతులుగారు 'వీళ్ళూ వీళ్ళూ ఒకరికొకరు తెలిసినవాళ్లేనా? నా సంభావనకేమీ ఎసరు పెట్టరు కదా?' అని అనుమాన పడిపోయారు.

ఎట్టకేలకు తను అనుకున్నట్లుగా సినిమాల్లో చూసినట్లే, చిన్నప్పుడు తనతోపాటు స్కూల్లో చదువుకున్న అమ్మాయే తనను ఏరికోరి వరించటంతో... చివరి మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన బ్యాట్స్‌మన్ లాగా తెగ సంబరపడిపోయాడు మన వినయ్ ఉరఫ్ వినాయకరావు.

# కగాకో.... ముగాభా...



బుద్ధవరపు కామేశ్వరరావు, 98480 47322

**వెంకాయమ్మ అక్కడికి వచ్చి అప్పుడే పది రోజులు అవుతోంది. ఎవరూ తెలిసిన వాళ్లూ, అలాగే తెలుగు భాష వచ్చిన వాళ్ళు కనబడక పోవడంతో, పాపం చాలా ఇబ్బందిగా ఉంది ఆమెకు. దానికి తోడు కగాకోకి ఏమైందో? అనే బాధ ఆమెను ఒకచోట నిలబడనీయడం లేదు. ఆ రోజు ధైర్యం చేసి పక్క గదిలో ఉంటున్న ఒక ఆవిడ వద్దకు వెళ్లి–**


"యామ్మోయ్! ఆ కగాకోకి ఎలావుందో నీకేమైనా తెలుసా?" అడిగింది వెంకాయమ్మ, సమాధానం కోసం ఆతృతగా ఎదురు చూస్తూ...

"యారూ??" అడిగింది ఆవిడ తమిళంలో.

"యారూ... తా...యారూ కాదే తల్లీ! కగాకో... కగాకో.. ఎలా ఉందో నీకేమైనా తెలుసా?" విసుక్కుంటూ అడిగింది కోపంగా.

"ఇల్లే, వాయిమూడు!" చెప్పింది ఆవిడ అంతే కోపంగా.

"ఏంటి! ఇడ్లీ మూడు వాయలు తింటానా? ఎన్ని వాయలు తింటే నీకెందుకే ముచ్చుమొహందానా? తెలియకపోతే తెలియదని చెప్పాలి కానీ, ఇలా నా తిండిని దిష్టి కొడతావా?" పెంకులెగిరిపోయేలా అరిచింది వెంకాయమ్మ.




వెంకాయమ్మ అరుపులకు అర్థం తెలియని ఆ అరవపావిడ ఇంక అరవడం మానేసి, అరవిప్పిన కన్నులతో అలా అమాయకంగా చూస్తూ ఉండిపోయింది.

ఆ గొడవ విని అక్కడికి వచ్చిన ఓ గుమస్తా వెంకాయమ్మను సముదాయించి, "రేపు ఉదయం మీ ఊరు నుంచి ఒకరు వస్తున్నారు, కగాకో గురించి వారికేమైనా తెలుసేమో, అడిగి చూడండి" అని ఆవిడ చెవిలో ఓ శుభవార్త పడేసాడు.

అంతే ఆ వార్త విన్న వెంకాయమ్మ ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూడసాగింది... తను పంపిన మొదటి కథ పత్రికలో ఎప్పుడు పడుతుందా అని ఎదురు చూసే కొత్త కథకుడిలా.

✦✦✦

మర్నాడు ఉదయాన్నే గేటు దగ్గర తిష్ట వేసిన వెంకాయమ్మను–

"అమ్మా! గుమ్మానికి అడ్డంగా ఉండకమ్మా! పెద్ద సారు చూస్తే తిడతాడు!" సున్నితంగా హెచ్చరించాడు గేటు కీపరు గవర్రాజు.

"ఉండవయ్యా! హేమిటా జబర్దస్తీ? ఈరోజు నాకు తెలిసిన ఒకరు ఇక్కడికి వస్తున్నారు. కగాకో గురించి వారికి ఏమైనా తెలుసేమో కనుక్కుందామని ఇక్కడ వెయిటింగ్!" అని అసలు విషయం చెప్పింది వెంకాయమ్మ.

"అలా అయితే సరే, కానీ కొంచెం పక్కగా కూర్చో అమ్మా!" చెప్పాడు టూకీగా గేకీ.

సాయంత్రం వరకూ ఎదురుచూసిన వెంకాయమ్మకు నిరాశే మిగిలింది. ఇంక తిరిగి గదికి వెళ్లిపోదామనుకున్న సమయంలో, లోపలికి వస్తున్న ఒకామెను చూడగానే ఎదురు వెళ్లి, ఆనందంగా–

"మాచమ్మక్కా! నువ్వా?... పొద్దున్నే వస్తావన్నారు... ఇంత లేట య్యిందేం?" ఆశ్చర్యంగా అడిగింది వెంకాయమ్మ.

"ఇక్కడికి వచ్చే ముందు టెస్టుల కోసం ఆసుపత్రికి తీసుకుని వెళ్లారే వెంకమ్మక్కా!... అక్కడే లేటయ్యింది!" చెప్పింది మాచమ్మ.

"సరే కానీ మాచమ్మక్కా! ఆ కగాకోకు ఎలా ఉందో, నీకు ఏదైనా తెలుసా?" కుతూహలంగా అడిగింది.

"ఉండవే... ప్రయాణంలో అలసిపోయాను. అయినా నేను గుమ్మం దిగి రెండు నెలలయింది.... ఆ కగాకో గురించి నాకేం తెలుస్తుంది? ఇదిగో నాయనా!... నాకు ఏ గది ఇచ్చారు?" గేకీని అడగడానికి విసవిసా నడుచుకుంటూ వెళ్లింది మాచమ్మ.

'దీని విస్సాటం మండిపోనూ... తెల్లారి లేస్తే రిపోర్టర్‌లా ఊర్లో అందరి విషయాలు సేకరిస్తూనే ఉంటుంది. కగాకో గురించి మాత్రం తెలియదంటోంది. దీని నోట్లో చెవి, నోరు పెట్టకూడదు' మనసులో అనుకుంటూ మౌనంగా అక్కడ నుండి లేచింది వెంకాయమ్మ.

✦✦✦



కగాకో గురించి ఆలోచిస్తూనే రెండు నెలలు గడిపింది వెంకాయమ్మ.

ఆ రోజు ఉదయం యధాప్రకారం గుమస్తాను కలసిన వెంకాయమ్మకు 'ఈ సాయంత్రం మీ పక్కఊరు నుంచి ఒకరు వస్తున్నారు' అన్న తీపి కబురు చెప్పడంతో సాయంత్రం గేటు వద్ద మళ్ళీ దీక్ష మొదలెట్టింది వెంకాయమ్మ.

"చూడమ్మా! పెద్ద సారు ఇంటికి వెళ్లే టైమ్ అయ్యింది. గుమ్మానికి అడ్డంగా కూర్చోకు" తన సహజధోరణిలో చెప్పాడు గేకీ.

"ఉండవయ్యా మా కగాకోకి ఏమయ్యిందో తెలియక నేను టెన్షన్‌తో చస్తుంటే, మధ్యలో నీ గోల ఏంటి? పెద్ద సారూ లేదు, వేడి చారూ లేదు. గమ్మునుండు" పిడుగులు కురిపిస్తూ గర్జించింది వెంకాయమ్మ.

కాసేపటికి అక్కడికి వచ్చిన వ్యక్తిని చూడగానే- "నువ్వా?... మహదేవుడన్నయ్యా!... ఇంకా ఎవరో అనుకున్నా. ప్రయాణం బాగా జరిగిందా? ఔనూ... ఆ కగాకోకి ఎలా ఉంది? ఏదైనా తెలిసిందా మహదేవుడన్నయ్యా?" కుతూహలంగా అడిగింది వెంకాయమ్మ.

"కంగారు పడకు. ఆ కగాకో చికాగోలో ఉంది!" విసుక్కుంటూ చెప్పాడు మహదేవుడు.

"అలాగా? పోనీలే అన్నయ్యా! మంచి వార్త చెప్పావు... సరే కానీ... నాకో డౌటూ... ఈ విషయం నీకు ఎలా తెలిసింది మహదేవుడన్నయ్యా?" మళ్ళీ బుర్ర తినేసింది వెంకాయమ్మ.

"నువ్వు గుమ్మం ముందు కూర్చుని, ఈ ప్రశ్న వేసి, వచ్చిన వాళ్ళ బుర్రని గోక్కుని తినేస్తున్నావని ఇదిగో ఇతను చెప్తే, ఎందుకైనా మంచిదని ఈ సమాధానం రెడీ చేసుకున్నా!" అని చెబుతూ తనను తీసుకుని వచ్చిన వ్యక్తిని చూపించాడు మహదేవుడు.

"వయసు వచ్చినా కానీ వెటకారం పోలేదు మా మహదేవుడన్నయ్యకి!" జబ్బలు చరుచుకుంటూ, జుబ్బా సర్దుకుంటూ జబ్బర్ దస్తీగా లోపలికి పోతున్న ఆ పెద్దాయన వైపు చూస్తూ మనసులో అనుకుంది వెంకాయమ్మ.

✦ ✦ ✦

కగాకో గురించి ఆలోచిస్తూనే, లోచిస్తూనే, చిస్తూనే, స్తూనే, నేను చూస్తుండగానే రెండు సంవత్సరాలు గడిపేసానా? ఆశ్చర్యంగా అనుకుంది వెంకాయమ్మ.

ఆ రోజు తన బంధువు ఒకరు వస్తున్నారు అని తెలిసిన వెంకాయమ్మ యధావిధిగా గుమ్మం దగ్గర తిష్ట వేసింది.

"అమ్మా! గుమ్మానికి అడ్డంగా ఉండకమ్మా! పెద్ద సారు చూస్తే తిడతాడు!" యధాప్రకారం తన గోత్ర ప్రవర వినిపించాడు గవర్రాజు.

"చూడు నాయనా! రెండు సంవత్సరాల నుంచి చూస్తున్నా. నీ పోస్టుకి ప్రమోషన్ లేదు, నా ప్రశ్నకు సొల్యూషన్ రాదు... ఎందుకు అనవసరంగా ఆయాస పడతావు?" సున్నితంగా

మందలించింది వెంకాయమ్మ.

కాసేపటికి లోపలికి వస్తున్న ఆమెను చూసి, ఆనందంతో..

"సూరమ్మత్తా! నువ్వా? ఎవరో అనుకున్నా. ప్రయాణం బాగా జరిగిందా?" తన సహజ ధోరణిలో అడిగింది వెంకాయమ్మ.

"అత్త ఏమిటే... అత్త! నీకన్నా ఓ ఇరవై ఏళ్లే కదా పెద్ద? ఈ సారి ఆ కూత కూసావంటే పళ్లు రాలగొడతా, భడవకానా!" బోసి దవడలు దబదబలాడిస్తూ, వెంకాయమ్మను దడదడ లాడించేసింది సూరమ్మ.

"రాలగొట్టడానికి నీకు లాగే నాకు కూడా అసలు పళ్లే లేవుగా?" బోసినోటితో నవ్వుతూ చెప్పింది వెంకాయమ్మ.


"అవసరమైతే కట్టుడు పళ్లు కట్టించి మరీ రాలగొడతా!" తెగేసి చెప్పింది సూరమ్మ.

"సరేకానీ సూరక్కా! ఆ కగాకో గురించి ఏమైనా సమాచారం తెలిసిందా?" ఎంతో ఆశతో, నెత్తిమీద కొంగు సవరించుకుంటూ అడిగింది వెంకాయమ్మ.

"ఉండవే! నా ముగాభాకి ఏమయ్యిందో తెలియక నేను ఏడుస్తుంటే, మధ్యలో నీ కగాకో గొడవ ఏమిటే?...పానకంలో పుడకలా?..." విసుక్కుంటూ చెప్పింది సూరమ్మ.

"ఈ ముగాభా ఎవరు సూరమ్మక్కా?..." బుగ్గలు బోసి నోట్లోకి తోస్తూ అడిగింది వెంకాయమ్మ.

"గుమ్మంలోనే నిలబెట్టి... ఏమిటా పిచ్చి ప్రశ్నలు? లోపలికి తగలడు, తీరిగ్గా చెబుతాను!" అని చెబుతూ...




"హేమిటీ అలా దేభ్యం మొహం వేసుకుని ఇంకా నిలబడి చూస్తున్నావు? నా గది ఎక్కడో చూపించి చావు!" అంటూ గేటు కీపరు గవర్రాజుని దబాయించి... గబగబా పరుగులు పెట్టించింది సూరమ్మ.

✦✦✦

ఓ రెండు నెలల తరువాత...

ఆ రోజు ఉదయం...

"మా హక్కులు మాకు కావాలి!... వాటి కోసం ఎంతకైనా పోరాడతాం!..." అంటూ యుగళగీతం అందుకున్నారు.

గేటుకీపరు గవర్రాజు– "అమ్మా! గుమ్మానికి అడ్డంగా ఉండకండమ్మా! పెద్దసారు వచ్చే వేళయ్యింది!..." ప్రాధేయపడ్డాడు గవర్రాజు.


"లేవే! వెంకాయమ్మా, ఇక్కడుంటే, ఇతను ఇలాగే అంటాడు... ఇక్కడ వద్దు. ఇందాకట్లా ఆ చివరికి పోయే హాయిగా అరుచుకుందాం... పద!" అంటూ లేవబోయింది సూరమ్మ.

"మీకు రెండు నమస్కారాలు తల్లులూ! అక్కడికి వద్దు. ఇక్కడే ఉండి అరుచుకోండి!..." చెవులు మూసుకుని చెప్పాడు గవర్రాజు.

"అలా రా దారికి! గట్టి.....గా అరవవే వెంకాయమ్మా! హక్కులు పరిరక్షణే మా ధ్యేయం." అంటూ గీతాలాపన మొదలెట్టింది సూరమ్మ.

ఈ లోగా అక్కడికి వచ్చిన పెద్దసారు పైడిరాజు– "ఇక్కడ ఏం జరుగుతోంది?" అంటూ కోపంగా గవర్రాజును అడిగాడు పైడిరాజు.

"ఆ బక్కాయన్ని భయపెడితే పాపం ఆయనేం చెబుతాడు, నేను చెబుతాను విను. ఏమయ్యా! మీ బిగ్ బాస్ ఇంతంత బిల్డింగులు కట్టేడు కదా? ఇక్కడికి వృద్ధనారీమణులు వస్తారని తెలుసు కదా?... వారికి కూడా ఏదో వినోదం కోసం ఏర్పాట్లు చేయాలి కదా? ఎంతసేపూ మీ వినోదం కోసం ఆలోచిస్తారు కానీ... మా గురించి ఆలో చించరా?" కాలర్ పట్టుకుని అడిగినంత సూటిగా ముక్తకంఠంతో అడిగారు వెంకా యమ్మ, సూరమ్మలు... ఆయనతో పాటు లోపలికి వస్తున్న నలుగురు అమ్మాయిల వంక ఈర్ష్యగా చూస్తూ.



ఆమె ప్రశ్నతో బిత్తరపోయి,

"సరేనమ్మా! మీ బాధ అర్థమయ్యింది. మీకు ఏం కావాలో చెప్పండి... మా బిగ్ బాస్ తో చెబుతా!" రాజీ ధోరణిలో అడి గాడు పైడిరాజు.

కగాకో, ముగాభా గురించి... పూర్తిగా పైడి రాజుకు వివరించారు వెంకాయమ్మ... సూరమ్మలు.


✦ ✦ ✦

ఆ రోజు మధ్యాహ్నం గవర్రాజు, పైడిరాజు, సూరపరాజులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విషయం సేకరించారు బిగ్‌బాస్.

ఆ తర్వాత అనుకోకుండా అక్కడికి వచ్చి, మొత్తం వారి సంభాషణలు విన్న వ్యక్తితో–

"ఇదిగో మూర్తిగారూ! ఈ సారి అటువైపు వెళ్ళినప్పుడు ఓ బుల్లి టీవీ తీసుకొచ్చి ఆ ఇద్దరు ముసలాళ్ల గదిలో ఏర్పాటు చేయండి. లేకపోతే మేసే గాడిదని కూసే గాడిద చెడగొట్టింది అన్నట్లుగా వీళ్ల వలన మిగతా వాళ్లు కూడా పాడవుతారు. ఔనూ!... ఇంతకీ ఆ కగాకో, ముగాభాలు ఎవరూ?" ఆసక్తిగా అడిగారు బిగ్‌బాస్.

"అవి తెలుగు టీవీల్లో దశాబ్దాలనుంచి ప్రవహిస్తున్న దినసరి దారుణ దుఃఖపూరిత ధారావాహికలు సార్! ఈ ముసలాళ్లు ఇద్దరూ తమకు ఊహ వచ్చినప్పటి నుంచి చూస్తున్నారు ఆ సీరియల్స్... అవి ఓ కొలిక్కి రాకుండానే వీళ్ళు ఇక్కడకు వచ్చేసారు... వాటి లేటెస్ట్ స్టేటస్ తెలియకపోవడంతో వీళ్లకు పిచ్చెక్కిపోతోంది సార్!" అసలు విషయం చెప్పారు మూర్తి.




"అంటే... వీళ్లకు చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు వయసు వచ్చినా ఆ భ్రమ పోలే దన్నమాట. సరేకానీ ఆ కగాకో, ముగాభాలు అంటే ఏమిటీ?'' తెలుసుకోవాలన్న కుతూ హలంతో అడిగారు బిగ్‌బాస్.

"హహహ..... కగాకో అంటే కరణం గారి కోడలు. అలాగే ముగాభా అంటే మునసబు గారి భార్య సార్!" నవ్వుతూ చెప్పారు మూర్తి.

"వార్నీ! ఔనా? బాగుంది. కానీ, నాకైతే వాళ్ళ ఆవేదనలో కూడా కొంచెం న్యాయం ఉందనిపిస్తోంది. మనకైతే ఈ నలుగురు అమ్మాయిల వలన ఏదో కాలక్షేపం అవుతోంది... మరి పాపం ఈ వృద్ధ మహిళా మణులకి కూడా ఏదైనా వినోదం ఉండాలి కదా?" రాజీ ధోరణిలో చెప్పారు బిగ్‌బాస్.

"ఔను సార్!... మీ ఆలోచన మంచిదే!" చెప్పారు మూర్తిగారు.

"అన్నట్టు ఇంకో విషయం. ఎందుకైనా మంచిది, ఆ టీవీ ఇక్కడ పెట్టినట్లు మా ఆవిడకు తెలియనీకండే!..." కొంచెం భయం భయంగా చెప్పారు బిగ్ బాస్.

"అలాగే సార్!" అని చెప్పి మీ భార్య సచీ దేవమ్మకు ఈ అలవాటు సోకితే మన బతుకు బస్టాండే అని నాకు తెలియదా ప్రభూ! అని మనసులో అనుకుంటూ స్వర్గాధిపతి అయిన బిగ్ బాస్ ఇంద్రుని వద్ద శెలవు తీసుకుని...

"మగువా మగువా ఈ సీరియల్స్ కు సరి హద్దులు కలవా?" అని పాడబోయి, నాలుక కరుచుకుని...

"నారాయణ! నారాయణ!!" అనుకుంటూ పోర్టబుల్ టీవీ కోసం భూలోక బాట పట్టారు నారదమూర్తి ఉరఫ్ నారదమహర్షి.





# నెల నెలా నవ్వుల వెన్నెల





**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- ప్రేమా-దోమ!


























**కార్టూనిస్టు 'శేఖర్ బాబు'** కు పర్లఖేముండి గజపతి స్టేడియంలో ఈ నెల 19న ఒడిషా వెనుకబడిన జాతుల అభివృద్ధి మంత్రి శ్రీ జగన్నాథ సరక, మాజీ మంత్రి ప్రదీప్ మరియు, చేతుల మీదుగా వేదిక మీద సన్మానించబడ్డారు. ఈ ఉత్సవాలు గజపతి జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్.పి. స్వాతి ఎస్ కుమార్, A.D.M. సంగ్రామ్ శేఖర్ పండా, పురపాలక చైర్మన్ నిర్మల సేథి తదితరులు పాల్గున్నారు. శ్రీ శేఖర్ బాబు 31-12-2022 లో 2వ అంతర్జాతీయ కార్టూన్స్ జెజెబూమ్ పోటీలో ద్వితీయ బహుమతి సాధించారు.



# మౌన వ్రతం



ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
9393662821

**విమలమ్మ మూడో కూతురు మాన్య, గార్డెన్‌సిటీ బెంగళూరులో కాపురం పెట్టింది.**

**'కొత్త కాపురం పెట్టి ఆరు నెలలైనా వచ్చి చూడలేదని' అమ్మని నిష్టూరమాడింది... కూతురికి చెప్పాపెట్టకుండా మొగుడు మునస్వామిని తోడు చేసుకుని మూర్చి మూడో తేదీన బస్సు ఎక్కింది విమలమ్మ.**

కూతురుండే ఫ్లాట్‌లోకి నవ్వుతూ వెళ్ళారు విమలమ్మ దంపతులు.

అల్లుడు అభిమానంగా– 'రండి అత్తమామలూ...' అంటూ లగేజి అందుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

కూతురు మాన్య పరిగెత్తుకుంటూ వచ్చి నీళ్ళు ఇచ్చింది.

వంట గదిలోకి వెళ్లి వేడివేడి ఫిల్టర్ కాఫీ చేసి ఇచ్చింది.

గంట అవుతున్నా మాన్య మాట వరుసకి కూడా అమ్మానాన్నలని పలకరించలేదు. మౌనంగానే అన్నీ చేస్తోంది. అవసరమైతే సైగలు చేస్తోంది.

ఊరినుంచి తెచ్చిన తోట కూర ఆకు ఒలుస్తూ విమలమ్మ–

"ఏమమ్మీ... మేము ఇంట్లోకి వచ్చి గంట అయినా మంచీ చెడ్డా మాట్లాడకుండా అట్లా ఇట్లా తిరగతా ఉండావు?" అని అడిగింది.

ఏవేవో సైగలు చేసి చూపింది మాన్య.


విమలమ్మ, అల్లుడి వైపు తిరిగి–

"ఆ అమ్మి చేసే సైగలు ఒక్క ముక్కా అర్థం కావడం లేదు అల్లుడూ... అసలు నా కూతురు మాతో ఎందుకు మాట్లాడటం లేదు?... మీకు మేమేమీ తక్కువ చేయలేదు కదా!... కాపురం పెడతా ఉండామంటే స్పూన్ మొదలుకుని షూట్ కేస్ దాకా తీసిచ్చినాము కదా!... ఏమి తక్కువ చేసినామని ఆ అమ్మి నోరు తెరవడం లేదు?" అని ముక్కు చీదింది.


ఐసు ముక్కలా కరిగిన అల్లుడు– "అయ్యో అత్తయ్యా! అదేమీ లేదు. మీ కూతురు ప్రతినెలా మూడో తేదీన మౌనవ్రతం చేస్తుంది. ఆ రోజు ఇంట్లో ఉన్న నాతో కానీ... పనిమనిషితో కానీ... పిల్లలతో కానీ మాట్లాడదు!" అని చెప్పాడు.

దేవుడి గదిలోకి పూజ చేయడానికి వెళ్తోన్న మాన్యను చూస్తూ విమలమ్మ– "మన ఇండ్లల్లో గురువారం బాబాకి, శనివారం వెంకటేశ్వరస్వామికి పూజలు, మౌన వ్రతాలు చేయడం మామూలే. అంతే కానీ... విచిత్రంగా ప్రతి నెలా మూడో తేదీ మౌనవ్రతం చేయడం ఏందబ్బా? విచిత్రంగా ఉండాదే!" అని ముక్కు మీద వేలేసుకుంది.

'విషయమేమిటి' అన్నట్లుగా చూసినాడు అల్లుడి వైపు మామ మునస్వామి.






సిగ్గు మొగ్గలవుతూ అల్లుడు– "నిజం మీకు కాక ఇంకెవరికి చెబుతాను మామా!... మా కంపెనీ వాళ్ళు ప్రతి నెలా రెండో తేదీన జీతం ఇస్తారు.... జీతం వచ్చిన రోజున, నెలంతా కష్టపడింది మరవాలని మా సెక్షన్ వాళ్ళ మంతా 'పార్టీ' చేసుకుంటాము. పార్టీ చేసుకోవడం మీ కూతురికి ఇష్టం లేదు... ఆమె చెప్పినట్లు వినడం లేదని నాపై నిరసనగా... ప్రతి నెలా మూడో తేదీన మౌనవ్రతం పాటిస్తుంది!" అని చెప్పి నంగినంగిగా అక్కడి నుంచి చిన్నగా గదిలోకి వెళ్ళిపోయాడు.

తను పనిచేసే కంపెనీలో మూడు నెలలకొకసారి జీతాలు ఇచ్చే విషయం గుర్తుకొచ్చింది మునస్వామికి. జీతం తీసుకున్న రోజు మిత్రులతో కలిసి చేసే 'సత్సంగం', విమలమ్మ చేసే 'దుముకు దుముకు మేళం' గుర్తుకు వచ్చాయి. లివర్ చెడినాక ఆ అలవాటు మానింది... తలుచుకుంటూ అమాయకంగా తల తిప్పి విమలమ్మ వైపు చూసినాడు మునస్వామి.

'మామా, అల్లుడూ దొందూదొందే!' అంటూ మునస్వామి తొడపైన గట్టిగా గిచ్చింది.


బయటికి శబ్దం రాకుండా లోపల్లోపలే గట్టిగా 'క్యార్' మన్నాడు మునస్వామి.

ఇంతలో... దేవుడి గదిలోని గంట గణ గణ గణ మోగింది.

# బాలి కార్టూన్‌కి క్యాప్షన్

**జనవరి నెల క్యాప్షన్ ఫలితాలు**

**బహుమతి పొందిన క్యాప్షన్**




**పి వి రామశర్మ, విశాఖపట్నం**

## మరికొన్ని క్యాప్షన్లు

✦ గౌప్పోళ్ళ కాలేజీ అని చేర్పించారుగా...అనుభవించండి!

**–మన్నవ సాయి రామ భార్గవి ప్రియ.**

✦ పేరెంట్సు మీటింగుకి, మేం కూడా నీలాగే రావాలంటే... ఎలాగరా!?

**–మన్నవ సాయిరామ గౌతమి షణ్ముఖ ప్రియ**

✦ అరే అజయ్! సాయంత్రం మీ అక్కకి పెళ్లి చూపులు... నువ్వు హాల్ లోకి రాకు, నిన్ను పెళ్లి కూతురు చెల్లెలు అనుకోగలరు. **–బాలసుబ్రహ్మణ్యం మోదుగ**

# మనసులో మాట



కంచనపల్లి ద్వారకనాథ్,
9985295605.

**అద్దంలో చూసుకుంటూ నుదిటిన వీబుదిపట్టీలు దట్టంగా దిద్దుకుని వాటి మధ్యలో గంధం, కుంకుమ బొట్లు పెట్టుకుని త్వరగా తయారై భుజానికి సంచి చేతిలో లాప్టాప్ బ్యాగుపట్టు కుని విశిష్టరావు కొడుకు పెళ్ళిసంబంధం కుదుర్చేందుకు స్కూటర్‌పై వేగంగా బయలుదేరాడు వామనమూర్తి.**

మాటల మాంత్రికుడు వామనమూర్తి తన వాక్చాతుర్యంతో విశిష్ట రావ్ గారి అమ్మ, నాన్న, భార్య రామలక్ష్మి, కొడుకు ధనుష్‌ను... కుటుంబ సమేతాన్ని మెప్పించి సంబంధం ఖాయం చేసి ఒప్పించాడు.

సంబంధం కుదిరిన సంతోషంలో వామనరావ్–

"శుభస్య శీఘ్రం!ఇక పెళ్ళికూతురు వాళ్ళను ఒప్పించడం నా బాధ్యత. నేను సెట్ చేసానంటే... ఫెవికాల్, ఫెవిబాండ్, ఫెవిక్విక్‌లాంటి వాటికి అతుక్కునే బంధాలు కంటే స్ట్రాంగ్‌గా ఉంటాయ్! అంతే!!... అంతెందు కండి... అసలు మ్యారేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్... అంటారు గాని అసలు మ్యారేజస్ ఆర్ మేడిన్ మై లాప్టాప్!" అని గట్టిగా నవ్వేసాడు.

అందరు నవ్వుకున్నారు.

✦✦✦

పెళ్ళికూతురు సృజన నాన్న, అమ్మలకు గుడా సంబంధం నచ్చడంతో, ఆడపిల్ల ఎందరి కాళ్ళకు మొక్కినా అత్తవారింటికి వెళ్ళాక తప్పదన్నట్లు సృజన, ధనుష్‌ల పెళ్ళి కుదిరి... 'చాదస్తం వారి పెళ్ళి పిలుపు' అని పెళ్ళి పత్రికలు అచ్చు అయ్యి– పీ...పీ...డుం...డం... అంటూ మేళ తాళాలు మ్రోగుతూ... రెండువందలమందికి పైగా ఇరుపక్కల బంధువులతో తిరుమలలో కళ్యాణ మండపంలో, షడ్రుచుల భోజనాలతో సంతోషంగా జరిగిపోయింది.

పెళ్ళికి వచ్చిన బంధువులు శ్రీవారిదర్శనం చేసుకుని... ఎవరి ఊర్లకు వారు బయలు దేరారు.

అప్పగింతలు అయిపోయాక... విశిష్టారావు వాళ్ళు కూడా వాళ్ళ ఊరు చేరుకొని... పెళ్ళిలో జరిగిన ముచ్చట్లు తలచుకుని సంతోషంగా నవ్వుకున్నారు. సృజన మాత్రం ధనుష్ వాళ్ళ నాన్నమ్మను చూసిన పుడల్లా తన పెళ్ళిచూపుల్లో వేసిన ప్రశ్నలు గుర్తు కొచ్చి... భయంతో ముఖాన్ని చాటేసుకుని తిరుగుతోంది.

కట్ చేస్తే ... ధనుష్ వాళ్ళ నాన్న హనీమూన్‌కి ప్లాన్ చేసి ఊటికీ ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసాడు.


ఆకాశంలో విమాన విహారం చేసి ఊటీ చేరుకొని రిసార్ట్స్‌లో దిగారు.

ధనుష్ కి ఫోటోగ్రాఫి అంట ఇష్టం. సృజనకు ప్రకృతి అంటే ఇష్టం. అక్కడి జలపాతాలు, పూల మొక్కలు, పచ్చదనాలు తిలకిస్తూ సృజనకు ఎన్నో ఫోటోలు తీసాడు. సృజన మనసులో ధనుష్ భర్తగా దొరికి నందుకు సంతోషించింది.

ఇద్దరు భోజనం చేసాక... సృజనతో– "సృజన! నిన్ను ఒకటి అడ గాలని వుంది... మన పెళ్ళి చూపుల్లో మా నాన్నమ్మ వేసిన ప్రశ్నలకు అన్ని జవాబులు మీ అమ్మే చెప్పింది. నువ్వు మాత్రం మౌనంగా చూస్తూ ఆలోచిస్తున్నావు. నేను అంతా గమనిస్తూనే వున్నాను. అసలు నువ్వు అప్పుడు ఎలా ఫీల్ అయ్యావు చెప్పవా?" అన్నాడు.

సృజన పక్కుననవ్వింది.

"ఎందుకలానవ్వుతున్నావ్?" అన్నాడు.




"ముందుగా మీ ఇంటి పేరు 'చాదస్తం 'అని తెలిసి ఇంటి పేరే కదా అనుకున్నా... కాని ఇంత చాదస్తం ఉంటుందనుకోలేదు." అంది.

"ఆమె పాతకాలపు మనిషి! అలాగే మాట్లా డుతుంది... అవి నీవు పట్టించుకుని నాకు ఎక్కడ దక్కకుండా పోతావో అని ఫీల్ అయ్యా! కానీ దేవుని దయవల్ల మన పెళ్ళి జరిగి పోయింది... సరే ఇంతకీ ఆమె ప్రశ్నలకి మీ అమ్మే ఎందుకు జవాబు చెప్పింది? చెప్పు!" అన్నాడు.

"మా అమ్మ కూడా పాతకాలపు మనిషి కాబట్టి ఆమె ప్రశ్నలకు జవాబులు చెప్పింది."

"సరే! ఇంతకి నీవు ఏమనుకున్నావో చెప్పు!" అడిగాడు.

"నా మనసులో అనుకున్నవి చెప్తాను... వినండి!" అంది.

"ఊc!...చెప్పు!" అని అత్యుత్సాహంగా అడిగాడు ధనుష్.

"వరసగా మీ **నా**నమ్మ ప్రశ్నలు...**నా మ**నసులో అనుకున్న **మా**టలు నాటకాలలో డైలాగుల్లా చెప్తాను వినండి... అని చెప్పడం మొదలు పెట్టింది.

**నాన్నమ్మ:** అమ్మాయికి వంటా వార్పూ... పిండి వంటలు వగైరా ఏమైనా నేర్పారా?

**నా.మ.మా:** ఈ కాలంలో ఆడపిల్లలు చదువు, ఉద్యోగాలలో పడి తీరికలేక , ఎప్పుడో రెండో మూడో వంటకాలు తప్ప ఎవరు నేర్చుకుంటున్నారు... అంతా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు ఇవ్వడం తప్ప!

**నాన్నమ్మ:** పొద్దున్నే లేవడం... కల్లాపి చల్లి ముగ్గు లేయడం... తులసి చెట్టుకు పూజలు చేయడం లాంటివి ఏమైనా ఉందా ?

**నా.మ.మా:** అపార్ట్‌మెంట్లల్లో కాల్లాపి చల్లి ముగ్గు వేయడం అన్నది అతిశయోక్తి, పోతే తులసి చెట్టుకు పూజ చేసినా... ఈ కాలంలో మంచి మొగుడు వస్తాడని నమ్మకం ఎంత మందికి వుంది?

**నాన్నమ్మ:** పాట, సంగీతం వాయిద్యం... ఏమైనా నేర్పించారా?

**నా.మ.మా:**ఈ కాలంలో ఫోనులు, టీవీలు చూసుకుంటూ కాలం గడిపేస్తుంటే...సంగీతాలు ఎక్కడ వింటారు?... టీవీలలో ఆటలు, పాటలు ప్రోగ్రామ్స్, సీరియళ్ళు... చూసుకునే అత్తగార్లు వుంటే పాటలు నేర్చుకుంటే ఇక ఆడవాళ్ళు పాట్లు పడాల్సిందే!

**నాన్నమ్మ:** కుట్లు కుట్టడం ఏమైనా నేర్చుకుందా?

**నా.మ.మా:** ఇప్పుడు మగా... ఆడా... తేడా లేకుండా జీన్సు ప్యాంట్లు, టీ షర్ట్స్ వేసుకోవడం లేదా రెడీమేడ్ డ్రస్‌లు కొన్నుకుంటున్నారే తప్ప, పాత సినిమాల్లో హీరోయిన్‌లా కుట్లు నేర్చుకుని, ఆఫీసుకి పోతున్న మొగుడి చొక్కా గుండి తెగి పోతే... వెంటనే సూది, దారం తెచ్చి... వంటి మీదనే గుండి కుదుతుంటే... హీరో ఆమె కళ్ళల్లోకి చూస్తున్న సీనులు ఇప్పుడు ఎక్కడ కుదురుతాయి?!

**నాన్నమ్మ:** చీరలు కట్టుకుని, పూలు పెట్టుకుని, వెళుతుందా?... డ్రస్సులు వేసుకుని వెళుతుందా?

**నా.మ.మా:** తొమ్మిది గజాల చీర కట్టుకుని, అర్థ రూపాయి అంత బొట్టు పెట్టుకుని... కుచ్చులు, పెట్టుకుని సీరియల్‌లో హీరోయిన్ లా తట్టెడు పూలు పెట్టుకుని ఆఫీసుకెళితే... ఆహా! గంగిరెద్దు వచ్చింది రా... నాయనా! అంటారు.



**నాన్నమ్మ:** బొట్టు పెట్టుకోవడంలో చాదు, తిలకం, కుంకం పెట్టుకుంటుందా?... స్టిక్కర్లు పెట్టుకుంటుందా?

**నా.మ.మా:** పొద్దున్న లేచి ఆఫీసుకు టైం అయ్యి ఉరుకులు పరుగులు తీస్తూనే తిలకాలు దిద్దుకుంటూ కూర్చుంటే అయినట్టే!

**నాన్నమ్మ:** నెయిల్‌పాలీష్, పెట్టుకుంటుందా? గోరింటాకు పెట్టుకుంటుందా?

**నా.మ.మా:** లాప్టాప్ ఆడితేకాని డొక్కాడని రోజుల్లో గోరింటాకు రుబ్బి పెట్టుకునే తీరిక ఎక్కడిది?

ఇలా పోలీసులు, సిఐడి వాళ్ళు... వేసినట్లు ప్రశ్నలు వేస్తే ఈ కాలంలో వాళ్ళు ఆ కాలం వాళ్ళలా... ఎవ్వరు వుంటారు చెప్పండి?" అంది.

అంతా విన్న ధనుష్ గట్టిగా నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతున్నారు?" అంది సృజన.


"నీకో నిజం చెప్పాలి!... అసలు మా నాన్నమ్మ అంత మాడ్రన్‌గా వుండి అలాంటి ప్రశ్నలు వేసిందని నీకు డౌట్ రాలేదు కదా! ఆమె నిన్ను అలాంటి ప్రశ్నలు వేయడానికి కారణం... ఆమె పెళ్ళి చూపుల్లో ఆ కాలంలో ఇలాంటి ప్రశ్నలు వేసే వారు... అంతేకాదు ఇంకా అడగరాని ప్రశ్నలు గుడా వేసేవారట! ఆమెకు సెంటిమెంట్లు, మూఢనమ్మకాలు... అంటే గిట్టవు... మన సంప్రదాయాన్ని, సంస్కృతిని గౌరవిస్తుంది. కాలానికి తగ్గట్లు, అవసరానికి తగ్గట్లు మారాలని అంటుంది. నిన్ను ఆ ప్రశ్నలు అడిగితే నీవు ఏమి జవాబు చేపుతావో అని టెస్ట్ చేసిందని మాతో ఇంటికి వచ్చాక చెప్పింది... ఆమె పెళ్ళి అయ్యాక మా ఇంట్లో వాళ్ళని చాలా వరకు మార్చి వేసింది!" అన్నాడు.


"అమ్మో!... మీ నాన్నమ్మను ఏమో అనుకున్నాను గాని..." అంటుండగా...


"ఆc...ఆc...ఇక ఆపు! నీవు నీ మనసులో మాటలు ఆరోజు బయటకి అని వుంటే...నా గతి గోవిందా! దీనికి ఇక శుభం కార్డు వేసి మన లోకంలోకి పోతాం పద!" అన్నాడు.


ఇద్దరు హాయిగా నవ్వుకున్నారు.

# నేటి ప్రేమికులు






## దట్టా... ఐతే ఓకే!

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

తర్కారావ్ గొంతు సవరించుకుని-

"ఫోన్ మోగడంతో ఎత్తి, "హలో శేఖరం... ఏమిటిలా ఫోన్ చేసావ్?" అడిగాడు రామారావ్.

ఆ మాటలకి శేఖరం "నీకేమైనా బుద్ధుందా రామారావ్! నువు ప్రపంచ సుందరి టీనాతో, 'మాటే మంత్రం' సినిమా మొదలుపెడుతున్నావ్ సరే... ఈ సినిమాని నువ్వు అంత పెద్ద మొత్తానికి ఎలా అమ్మగలవూ అని? ఎందుకంటే, పెద్ద హీరోయిన్‌కి అంత డబ్బు ఇచ్చి తీస్తే, ఈ రోజుల్లో అంత డబ్బు పెట్టి నీ సినిమాని ఎవరు కొంటారు చెప్పు. ఒకవేళ కొన్నా, ఆ సినిమా కానీ అటూ ఇటూ అయతే ఇహ నీ పని గోవిందా!... డబ్బు తిరిగి ఇవ్వమని నీ పీక పట్టుకుంటారు. కనుక ఇప్పటికైనా మించిపోయింది లేదు, నా మాట విని హీరోయిన్ ఆరోగ్య సమస్య అని చెప్పి వేరే చిన్న హీరోయిన్‌ని పెట్టి సినిమా లాగించెయ్!" అన్నాడు కాస్త కంగారుగా.

అతని మాటలకి కాస్త ధీమాగా నవ్వుతూ-"అబ్బే నువ్వు మరీ అంత కంగారు పడాల్సిన పనిలేదు శేఖరం! నా లెక్కలు నాకున్నాయి. ఈ సినిమాని మరీ అంత ఎక్కువకేం అమ్మను. అలాగే హీరోయిన్ రెమ్యునిరేషన్ కూడా తక్కువే ఇచ్చాను. కారణం,కొన్ని రోజులకే కాల్‌షీట్స్ తీసుకుని, సినిమా మొత్తం కంప్లీట్ చేసేస్తాను.అప్పుడు బడ్జెట్ పెరగదు! తక్కువకి డిస్ట్రిబ్యూటర్స్‌కి అమ్మి సొమ్ము చేసుకుంటాను!"చెప్పాడు చిన్న నవ్వుతో.

క్షణం పాటు నిట్టూర్చి..."భలే వాడివే... నీకు ఇది మొదటి సినిమా కాబట్టి నీకు వివరం తెలిసి చావడం లేదు. అసలు అంత తక్కువ డేట్స్ తీసుకుని అంత పెద్ద సినిమాని ఎలా కంప్లీట్ చేయగలవ్? ఆ డైరక్టరు ఎవరో గానీ... నిన్ను వెర్రివెంగళప్పని చేస్తున్నాడని నా అనుమానం... కాబట్టి ఈ స్నేహితుడి మాట విని ఈ ప్రయత్నం మానుకో!" మరోసారి హెచ్చరిస్తున్నట్టు చెప్పాడు శేఖరం.


మళ్ళీ చిన్నగా నవ్వుతూ- 'ఈ సినిమాకి కథ నాదే, దర్శకుడూ నేనే... ఎవరికైనా ఇస్తే నాశనం చేస్తారని, నా సినిమా నేనే తీసుకుంటున్నాను. ఇక ఈ సినిమాకి హీరోయిన్ డేట్స్ తక్కువ రోజులు తీసుకుని సినిమాని ఆరామ్‌గా కంప్లీట్ చేయగలను. దానికి నా దగ్గర ఓ సూపర్ ప్లాన్ ఉంది. అది నీకు చెప్తే ఆశ్చర్యపోతావ్!" చెప్పాడు గర్వంగా.

"ఏవిటది?!" అంటూ ఆశక్తిగా అడిగాడు శేఖరం.

రామారావ్ విషయం ఇంకా పూర్తిగా చెప్పకముందే...

"ఆ అర్థమైందిలే... ఆ హీరోయిన్ రూపాన్ని కొంత గ్రాఫిక్ వర్క్‌తో నడపడం లాంటివి చేస్తావ్! అంతేగా?" అడిగాడు.

"అమ్మో అలా అయితే ఇంకా ఖర్చు పెరిగిపోయి, తడిసి మోపెడై పోతుంది. అదేం కాదు" అని రామారావ్ అసలు విషయం చెప్పడంతో, కాస్త ప్రశాంతంగా..."మొత్తానికి మంచి ఐడియానే వేశావ్! అలాగే చెయ్!!" అంటూ నవ్వుతూ ఫోన్ పెట్టేసాడు శేఖరం... ఇప్పుడు చెప్పు! రామారావ్ కథానాయిక దగ్గర అంత తక్కువ డేట్స్ తీసుకుని, ఆ సినిమాని ఎలా కంప్లీట్ చేయగలడు? అది కూడా సినిమా మొత్తం ఆమె పైనే నడుస్తుందాయే... అలా అని గ్రాఫిక్స్ గట్రా కూడా వాడలేదు. ఇది ఎలా సాధ్యం?" అడిగాడు తర్కారావ్.



"సింపుల్ సార్! ఆ అమ్మాయి లాంటి డూప్‌ని పెట్టి మిగతా సినిమా మొత్తం తీసేస్తారేమో! అంతేనా సార్!" అన్నాడు నమ్మకంగా.

"కాదు తమరి బొంద! ఈ సినిమా కథ ప్రకారం, ఆమె అనుకోకుండా మాయం అయిపోతుంది... అందుకని సినిమా మొత్తం కథానాయిక అక్కడక్కడా కనిపిస్తుంది... అంటే, ఆమె సినిమాలో తక్కువ శాతం కనిపించి, ఎక్కువ శాతం వినిపిస్తుంది. దాంతో ఆమె ఎక్కువ డేట్స్ ఇవ్వకుండానే సినిమా కంప్లీట్ అయిపోతుంది కదా! అదీ రామారావ్ ప్లాన్! నువ్వు చెప్పలేక పోయావు కనుక... ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు!" అని తర్కారావు చెప్పగానే...

"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్థం చేసుకోరు కదా?..." అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావ్.




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె. ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలనుకుంటుంటాడు. ఆంధ్ర కుర్రాడు చందుని ఇష్ట పడుతుంది ఇందు. అయితే ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే ఇందునిచ్చి పెళ్ళి చేయాలనుకునేందుకు కారణం వంద సంవత్సరాల గతంలోకి వెళ్ళాల్సిందే... అలా వెళ్ళాక... సుబ్బారావు. అప్పన్నలు పోలీస్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్ వెళతారు. గోల్కొండ కోట దగ్గర్నుంచి ఒక పొట్టి వ్యక్తి వీళ్ళను వెంబడిస్తుంటాడు. సుబ్బారావు, అప్పన్నలు ఒక పార్టీకి వెళతారు. అక్కడోహత్య జరిగి, ఒక నక్లెస్ దొంగిలించబుతుంది... పోలీసులు ఎన్క్వైరీ చేస్తుంటారు.

ప్రస్తుతం...

**"నేను అసలు నమ్మలేకపోతున్నాను!" అన్నాడు సుబ్బారావు, నేల వంక చూస్తూ.**

**అప్పన్న మౌనంగా ఆకాశం వంక చూసాడు.**

**"ఈ మనుషులేంటి వదినా! మాట్లాడుకునేటప్పుడు, మొహామొహాలు చూసుకోకుండా దిక్కులు చూస్తారు? ఒకాయన నింగిని, ఇంకొకాయన నేలను చూస్తున్నారు. ఎందుకంటావ్?" అంది ఓ కోతి.**

**"వాళ్లు ఏమైనా మనలా కోతులా? సూటిగా మొహామొహాలు చూస్తూ మాట్లాడుకోవడానికి!" అంది రెండో కోతి.**

**"అంటే...గోల్కొండ దగ్గర, పిల్లలు ఎక్కిన ఆ గుర్రం పిచ్చిపిచ్చిగా పరుగెత్తడం... మనం నిజాం ఇచ్చిన డిన్నర్‌కు వెళ్లడం, అక్కడ గలాటా, ఇదంతా ముందే ప్లాన్ చేసారా?" అడిగాడు సుబ్బారావు.**

"అవును!" అన్నాడు అప్పన్న.

మళ్ళీ కోతులు మాట్లాడుకోసాగాయి.

"ఇదేంటి వదినా...వామ్మో! గోల్కొండ దగ్గర గుర్రం అట, నిజాం ఇచ్చిన డిన్నర్ అట... ముందేమో వజ్రాల నెక్లెస్ అన్నారు. ప్లాన్ అంటున్నారు. ఏంటో పెద్ద యవ్వారమే!"

"అవును వదినా! ఆ చెట్టు మీద కూర్చున్న వాడు... ఏదో కొంపముంచినట్టు ఉన్నాడు. అందుకే పొడిపొడిగా సమాధానాలు ఇస్తున్నాడు!" అంది ఇంకో కోతి.

"అప్పన్న! ఎందుకలా పొడిపొడిగా సమాధానాలు ఇస్తున్నారు?" అన్నాడు సుబ్బారావు.

అప్పన్న చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

"ఎందుకలా నవ్వుతున్నారు? చేసిందేమో దొంగ పని. ఉన్నదేమో పోలీస్ ఉద్యోగంలో! సిగ్గనిపించటం లేదా?"అన్నాడు సుబ్బారావు.

"దొరకనంత వరకు నేనూ దొరనే ... సుబ్బారావు గారు!" అన్నాడు అప్పన్న.

"మీ దొంగతనం విషయాన్ని... నేను పై అధికారులకు రిపోర్ట్ చేస్తే...ఏం అవుతుందో తెలుసా?"

"ఎవరికి రిపోర్ట్ చేస్తారు?"

"మన పై అధికారి జాక్సన్ దొరకు రిపోర్ట్ చేస్తాను. లేదంటే... ఆయన మీదున్న నిక్సన్ దొరకు రిపోర్ట్ చేస్తాను." అన్నాడు సుబ్బారావు.

అప్పన్న పగలబడి నవ్వి...

"మిమ్మల్ని చూస్తుంటే... జాలి వేస్తోంది సుబ్బారావు గారు! మీరెప్పుడో సత్తెకాలంలో పుట్టాల్సిన వాళ్ళు. రిపోర్ట్ చేసి, అనవసరంగా మీ టైం వేస్ట్ చేసుకోకండి. మీరేం చూడలేదు. మీకేం తెలియదు...అన్నట్లు ఉండండి!" అన్నాడు అప్పన్న.


"ఈ తెల్లవాళ్ళ పేర్లలో... జాన్సన్, రిక్సన్, నిక్సన్ అని ఉంటాయేంటి?..." అడిగింది ఓ కోతి.

"బొంబాయి సర్కస్‌లో పని చేసి, తప్పించు కొచ్చిన మా తాత చెప్పాడు. సన్ అంటే... కొడుకు అని అర్థం అంట! నిక్సన్ అంటే... నిక్కుగాడి కొడుకు! జాక్సన్ అంటే...జాక్ గాడి కొడుకు! రిక్సన్ అంటే... రిక్కు గాడి కొడుకు.. ఇదీ అర్థం!" చెప్పింది ఇంకో కోతి.


"రిపోర్ట్ చేస్తా! అప్పుడు ఏం చేస్తారో చేసు కోండి!" అన్నాడు సుబ్బారావు వెళ్ళిపోతూ.

"మీ ఖర్మ!" అన్నాడు అప్పన్న.

సుబ్బారావు తన గుడారంలో కూర్చొని... తమ పైఅధికారి జాక్సన్ దొరకు ఇంగ్లీష్‌లో,



దెయ్యాల గోల -ఎస్.వి.ఎస్.రావు




అప్పన్న చేసిన దొంగతనం పై తనకు తెల్సినది అంతా వివరంగా కంప్లైంట్‌లా రాయసాగాడు. సిరా బుడ్డిలోని ఇంక్ మొత్తం ఐపోయింది.

ఈలోపు అక్కడికి వచ్చిన అప్పన్న–

"అయ్యయ్యో! సుబ్బారావుగారు! ఇంటికి ఉత్తరాలు రాయడం కోసం తెచ్చుకున్న సిరా మొత్తం నా మీద కంప్లైంట్ రాయించడం కోసం అవగొట్టేసారా?... ఇదిగో నా సిరాబుడ్డి తీసుకోండి!" అని తన ఇంక్ బాటిల్‌ను సుబ్బారావుకు ఇచ్చాడు అప్పన్న.

అప్పన్న ధైర్యం చూస్తుంటే, సుబ్బారావుకు భయం వేసింది. అయినా సరే మొండిగా ఆ ఇంక్ బాటిల్ తీసుకొని, పూర్తిగా రాసేసి, తమ పైఅధికారి జాక్సన్ దొర దేరాలోకి వెళ్ళి... ఆయన టేబుల్ మీద ఆ ఉత్తరాన్ని పెట్టి, దాని మీద పేపర్ వెయిట్ పెట్టి మరీ వచ్చాడు.

అప్పన్న, అసలు తమ మధ్య సంభాషణ ఏదీ జరగనట్టుగా మామూలుగానే ఉన్నాడు.

అయితే, ఆ రెండు కోతులు మాత్రం ఏం జరుగుతుందో ఏమిటోనని టెన్షన్‌తో... సుబ్బారావు, అప్పన్న దేరా నుండి... జాక్సన్ దేరాకు మధ్యలో ఉన్న చెట్ల కొమ్మల మీదే తచ్చాడుతున్నాయి.

ఆ అడవిలో గుర్రపు స్వారీ చేసి వచ్చి, తన దేరా ముందు ఆగాడు జాక్సన్ దొర.

అటెండర్ బకెట్‌లో నీళ్ళు తెచ్చి పెట్టాడు.

కాళ్లూ చేతులూ కడుక్కొని, పోలీస్ అధికారి జాక్సన్ దేరాలోకి వెళ్ళి... కుర్చీలో కూర్చొని, సుబ్బారావు రాసిన ఉత్తరాన్ని చదివాడు.

ఈ లోపు అటెండర్, టీ తయారుచేసి తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టాడు.

సుబ్బారావును పిలుచుకు రమ్మని, అటెండర్‌కు చెప్పి టీ తాగసాగాడు జాక్సన్.

పది నిమిషాలలో, సుబ్బారావు జాక్సన్ దేరాలోకి వచ్చి సెల్యూట్ చేసి... అటెన్షన్‌లో నిలబడ్డాడు.

"ఈ ఉత్తరం మొత్తం చదివాను మిస్టర్ సుబ్బారావ్! ప్రతి అంశం నీతో చర్చించాలి అని పిలిచాను!" అన్నాడు జాక్సన్.

"థాంక్యూ సర్!" అన్నాడు సుబ్బారావ్.

"సుబ్బారావ్! నీకు ఇంగ్లీష్ ఎవరు నేర్పించారు?" అడిగాడు జాక్సన్.

"సర్! స్కూల్లో నేర్చుకున్నాను సర్!"

"ఉత్తరం రాసేటప్పుడు, తేదీ ఎటు వైపు వెయ్యాలో తెలియదా?"

"........."

Dear Sir/Madam... అని ఎందుకు రాసావ్?... ఇక్కడ మేడం ఎవరున్నారు?... అంటే.. నేను నా భార్యతోనో, ఇంకెవరితోనో ఇక్కడికి వచ్చాను అని నీ ఉద్దేశ్యమా?"

"అది...అది...ఉత్తరాలు ఎలా రాయాలో స్కూల్లో నేర్పించేటప్పుడు అలాగే నేర్పించారు సర్... సారీ సర్..."

"Dear Sir / Madam అని రాసాక, కామా పెట్టాలని తెలియదా?"

"స..స..సారీ సర్,"

"స్టీల్ అంటే నీ ఉద్దేశ్యం ఏంటి?"

"దొంగతనం సర్!"

"నువ్వు Steel అని రాసావ్. Steal అని రాయాలి. తెలియదా?"

"సారీ సర్..."


"నెక్లెస్ స్పెల్లింగ్ ఏంటి?"

"neck less"

"ఎవడు చెప్పాడు నీకు?"

".........."

"Necklace! ఇదీ నెక్లెస్ స్పెల్లింగ్!దాదాపు 100 స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నాయి. అవన్నీ సరి చేసి, మళ్ళీ ఉత్తరం రాసి తీసుకురా పో..."



"సార్... అదీ ఉత్తరంలో విషయం...."

"చూడు సుబ్బారావ్! అన్నంలో ముద్ద ముద్దకు ఓ రాయి వస్తే... ఆ అన్నం తినగలమా?"

"లేదు సర్."

"ఇదీ అంతే! వెళ్ళి... రాసి తీసుకురా....పో!"

"సర్! ఇంక్ అయిపోయింది సర్!"

"వేరే వాళ్ల దగ్గర అరువు తీసుకో..."

"చిత్తం సర్!" అనేసి సెల్యూట్ కొట్టి, తన గుడారానికి వచ్చాడు సుబ్బారావ్.

✦✦✦

అప్పన్న పాటలు పాడుకుంటూ, భార్యకు ఉత్తరం రాసుకుంటున్నాడు.

"కొంచం ఇంక్ కావాలి..." అన్నాడు సుబ్బారావ్.

"అయ్యో దానికేం భాగ్యం సుబ్బారావ్ గారు... నా ఇంక్ తీసుకోండి!" అన్నాడు అప్పన్న.

సుబ్బారావ్‌కు అప్పన్నను చూస్తే కంపరంగా ఉంది. ఇంక్ తీసుకొని... ఉత్తరం రాయసాగాడు.

"అప్రాక్సిమేట్లీ స్పెల్లింగ్ ఏంటి?" మధ్యలో సందేహం వచ్చి, అప్పన్నను అడిగాడు సుబ్బారావ్.

అప్పన్న, స్పెల్లింగ్ చెప్పాడు. కాసేపు అయ్యాక..."ఇమ్మీడియట్లీ స్పెల్లింగ్ చెప్పండి!" అన్నాడు.

ఈసారి దాదాపు రెండు గంటలు కూర్చొని ఉత్తరం రాసి, మళ్ళీ తీసుకెళ్లి... జాక్సన్ దొరకు ఇచ్చాడు.

జాక్సన్ దొర..కాసేపు నిద్రపోయి లేచి, ఉత్తరాన్ని చదివి మళ్ళీ సుబ్బారావును పిలిపించాడు.

"సుబ్బారావ్! నువ్వు తెలుగులో మాట్లాడేటప్పుడు, నేను గుర్రాన్ని చూసాను... అంటావా లేక... నా చేత గుర్రం చూడబడింది... అని అంటావా?"

"నేను గుర్రాన్ని చూసాను... అని అంటానండి!" అన్నాడు సుబ్బారావు.

"ఇంగ్లీష్ లో డైరెక్ట్ స్పీచ్, ఇన్-డైరెక్ట్ స్పీచ్ అని ఉంటాయి అవునా?"

"చిత్తం!"


"దాదాపు 60 వాక్యాలు.. అవసరం లేకపోయినా ఇండైరెక్ట్ స్పీచ్‌లో రాసావ్. అంటే... గుర్రం నా చేత చూడబడింది, ఆ డైమండ్ నెక్లెస్ అతని చేత దొంగతనం చేయబడింది. అన్నట్టు వాక్యాలు రాసావు. చదవడం చాలా కష్టంగా ఉందయ్యా! నువ్వో పని చెయ్యి... ఉత్తరాన్ని చక్కగా డైరెక్ట్ స్పీచ్‌లో రాసి... పట్టు కురా... పో!"

"ప్లీజ్! ఉత్తరంలో విషయం చదవండి సర్."


"ఉత్తరం లో ఏం చదవాలో, ఎలా చదవాలో చెప్పడానికి నువ్వెందుకయ్యా? ఉత్తరం ఎలా చదవాలో నాకు తెలీదా?... వాక్యాలు సరిగ్గా ఉంటే కదా... విషయం నాకు అర్థం అయ్యేది!" అన్నాడు జాక్సన్.


"సర్! ఆ అప్పన్న దొంగతనం చేసాడు సర్! అది విషయం!!" **(సశేషం)**

భలే బాస్!




సమర్పించు కార్టూన్






Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం 2023 సందర్భంగా కార్టూన్ పోటీలు



**శ్రీ తలిశెట్టిరామారావు జయంతి మే,20,**
**తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం** సందర్భంగా
డా॥ కె.వి.రమణగారి ఆశీస్సులతో
హాస్యానందం నిర్వహిస్తున్న
ఈ కార్టూన్ పోటీలో
మన కార్టూనిస్టులు పాల్గొని
విజయవంతం చేయాలని కోరుతూ...

| | | |
|---|---|---|
| మొదటి బహుమతి | - ₹ 10,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| రెండవ బహుమతి | - ₹ 6,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| మూడవ బహుమతి | - ₹ 4,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| విశిష్ట బహుమతులు (20) | - ₹ 1,000/- | + ప్రశంసా పత్రం |

నిబంధనలు: ✦ సబ్జెక్ట్ మీఇష్టమే ✦ అశ్లీల కార్టూన్లు పంపవద్దు ✦ ఒకరు 4 కార్టూన్లు మాత్రమే పంపాలి
✦ పరిశీలనలో ఉన్నవి, కాపీ కార్టూన్లు పంపవద్దు ✦ కార్టూన్ అటాచ్ చేసేటప్పుడు మీ పేరు ఫోన్ నెంబరు తప్పనిసరిగా రాయాలి
✦ ఫలితాలు హాస్యానందం మే,2023 సంచికలో ప్రచురించబడుతుంది.

## బాపురమణ కార్టూన్ పురస్కారం-2023

2022 జనవరి నుండి 2023 జనవరి దాకా ఏ మీడియాలోనైనా
మీరు వేసిన కార్టూన్లోంచి మీకు బాగా నచ్చిన కార్టూన్
ఒక్కటంటే ఒక్కటి పంపిస్తే వాటిల్లో ఒక దానికి
*బాపు రమణ పురస్కారం* ఇస్తూ
సన్మానించాలని నిర్ణయించాం!
**8000 రూపాయల పురస్కారం**తో పాటు...
ప్రశంసా పత్రం, సత్కారం.

## శేఖర్ అవార్డు- 2023





ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ శేఖర్ పేరిట నిర్వహిస్తున్న
**శేఖర్ అవార్డు 2023** కార్టూన్ పోటీకి
**'నేటి చదువులు'** అనే అంశంతో
కార్టూన్లు ఆహ్వానిస్తున్నాం!
**10,000 రూపాయల పురస్కారం**తో పాటు
ప్రశంసాపత్రం, మెమెంటో.

**కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరి తేదీ 1, ఏప్రియల్, 2023**

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపవలెను- hasyanandampoteelu@gmail.com

Hasyanandam February-2023. RNI No. APTEL 08387/01/1/2003-TC



చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

# Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548